Entered
ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
డిసెంబర్ 5, 2010

16TH ASIAN GAMES
Guangzhou 2010



అదరగొట్టిన ఆసియాడ్

హ్యాపీబర్త్‌డే

(2010 డిసెంబర్ 5 నుంచి 2010 డిసెంబర్ 11 వరకు)

కె. నందీప్
6సం॥, డిసెంబర్-2004
మాధవి-బసవయ్య
పిల్లాయిపల్లి-నల్లగొండ

శర్వాణి (స్మైలీ)
2సం॥, డిసెంబర్-7
లక్ష్మీఅనురాధ-మురళీమోహన్
నంద్యాల-కర్నూల్

దిలీప్‌కుమార్
10సం॥, డిసెంబర్-5
అనురాధాదేవి-మురళీకృష్ణ
కాకినాడ-తూ॥గో॥

నక్షత్ర
3సం॥, డిసెంబర్-7
సునీత-రవి
నిజాంపేట్-ఖమ్మం

ఎన్. హరిణి మీనాక్షి
డిసెంబర్
స్వరాజ్యలక్ష్మి-శాస్త్రి
శ్రీనివాసనగర్-సికింద్రాబాద్

అక్షర
1సం॥, డిసెంబర్-2009
సుజాత-విజయ్‌కుమార్
గణేష్‌నగర్-ఉప్పల్

తనూజ్‌కుమార్
3సం॥, డిసెంబర్-6
భాగ్యలక్ష్మి-శివప్రసాద్
మార్కాపురం-ప్రకాశం

ఎ. శశిప్రీతి-శశిప్రీతమ్
డిసెంబర్-7
త్రివేణి-సుధాకర్
వేదాయపాళెం-నెల్లూరు

ఎ. సాయిసృజన్‌రాజు
డిసెంబర్-5
శాంతి-సురేష్
వేదాయపాళెం-నెల్లూరు

పి. సాయికిరణ్
డిసెంబర్-5
లక్ష్మి-యల్లయ్య
మార్కాపురం-ప్రకాశం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పెన్ను పేపర్ తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు, పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు, తల్లిదండ్రుల వివరాలు రాసి కలర్ ఫోటో జతచేసి పోస్ట్ చేయండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

మనలో మాట

పదవీ ప్రహసనం



'పదవీ, పదవీ నువ్వేం చేస్తావూ?' అని మనం అడిగామనుకోండి. పదవి పెదవి విప్పగలిగితే - అది వినిపించే 'పదవోపదేశం' ఇలా ఉంటుంది :

"అధికారమే పరమార్థం, సంపాదనే లక్ష్యం. సంపద ఉంటేనే అధికారం... అధికారం ఉంటే సంపద... తరహాలో సాగే రాజకీయాల్లో నేనే సర్వమూ, సమస్తమూ. నా చుట్టూనే నాయకుల ఎత్తుగడలూ పైరవీలూ. ఇక్కడ ఏ విలువలూ, ఏ సంబంధాలూ ఉండవు. విధేయతా, అవిధేయతా అనేవి అర్థం లేని మాటలు. అవి ఎవరికి వారు అధికార నిచ్చెనలు ఎక్కడానికి ఆడే రాజకీయ నాటకాలు. ఎవరే కబుర్లు చెప్పినా అవన్నీ పదవి చుట్టూ, పవరు చుట్టూ పరిభ్రమించేవే! నీతీ నిజాయితీ, నియమ నిబంధనలూ, బంధుత్వం, స్నేహం, జనమూ వారి ప్రయోజనమూ లాంటివి పదవీ కాంక్ష ముందు బలాదూర్! ఇలాంటి నాయకులు పదవి పొందటానికి దేనికైనా సిద్ధపడతారు. అవసరం అనుకుంటే- శిరస్సు వంచి పాదాభివందనాలు చేస్తారు. కాదనుకుంటే- కాళ్ళు లాగి పారేస్తారు. ఎన్నికల్లో టికెట్టుకోసం, టికెట్టొస్తే గెలుపుకోసం, గెలిస్తే మంత్రి పదవి కోసం, పదవొస్తే 'ప్రాధాన్యం' కోసం... ఇలా సాగుతూనే ఉంటుంది అధికార దాహం! ఆలింగనాలూ అభివందనాలూ, అలకలూ ఆగ్రహాలూ... అన్నీ అధికార దండం కోసమే!

పదవీ పందేరం సాగేవేళ... నాయకులు చేసే విన్యాసాలూ, వివిధ రస పోషణల ముందు ఏ నటుడూ పనికి రాడు. పంపకాలకు ముందు వీర విధేయం, పంచేటప్పుడు శాంత స్వరూపం, పదవి దక్కనప్పుడు ఆగ్రహోదగ్రం ... క్షణాల్లోనే రక్తి కట్టిస్తారు.

అన్నప్రాసన రోజునే ఆవకాయను ఆరగించాలనే ఆతురత కొందరిది. ఆవకాయ ఇచ్చేస్తే- తమ పెత్తందారీ పట్టు సడలి పోతుందనే భయం ఇంకొందరిది. 'అమ్మ' మనసెరిగి వీర విధేయత, విపరీత భక్తి ప్రదర్శించే వందిమాగధ బృందం ఒకటైతే... గుంపులోనే ఉండి గోతులు తవ్వే అసమ్మతి దళం మరొకటి. విషాదమేమిటంటే- ఈ పదవీ ప్రహసనంలో ప్రజల సమస్యలు పక్కకి పోతాయి. టీవీలూ పత్రికలూ ఇంకే సమస్యా లేనట్టు 24 గంటలూ ఈ డ్రామాలనే ఊదరగొడతాయి. జనాన్ని 'మాస్ మీడియా'కు గురి చేస్తాయి.

ప్రస్తుతం రాష్ట్రంలో సాగుతున్న అధికార ప్రహసనంలో ఎన్నో ఆవేదనలున్నాయి. ఆరోపణలున్నాయి. అలకలున్నాయి. ఆగ్రహాలున్నాయి. రాజీలున్నాయి. రాజీనామాలున్నాయి. కానీ, ఎక్కడా ప్రజల సమస్యలపై ప్రస్తావన లేదు. ప్రజాసంక్షేమం గురించిన చర్చ లేదు. నాయకులు తమ పదవుల గురించే తప్ప తమకు 'అధికారం' ప్రసాదించిన ప్రజల గురించి పట్టించుకోవటం లేదు. ఎందుకంటే- ఇవి పాలకుల రాజ్యాలే తప్ప, ప్రజారాజ్యాలు కావు! ఇక్కడ నాకు ఉన్న ప్రాధాన్యం ప్రజలకు ఉండదు. ఆ అజెండా మారేంతవరకూ జనానికీ తిప్పలు తప్పవు."

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
తెల్సా	...	7
సీరియల్	...	8
అవధానం	...	10
లైట్ తీస్కో	...	11
అట్టమీది కథ	...	14
కొత్త పుస్తకాలు	...	20
ఈ పేజ్	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

జ్వాల రగిల్చిన జాషువా కవిత్వం



సినిమా ... 12

అడ్డగోలు రేట్లతో అధికారిక దోపిడీ

కథ ... 18

బాకీ



అబ్బురపరచాయి

అట్టమీది కథ ఆసక్తిదాయకంగా సినీ జనానికి సూచనప్రాయంగా వుంది. కొన్ని నగ్న సత్యాలను తెలిపారు. అవి నిర్మాతలకు ఉపయోగకరంగా వున్నాయి. 'తెల్సా' ద్వారా అబ్బురపరిచే విషయాలు తెలుసుకున్నాం. 'సమాధానం' కథ బాగుంది. చివరిగా 'గాడిద పాట'లోని నీతి బోధన బాగుంది. మరి కొన్ని జనరల్ విషయాలు తెలిపే శీర్షికలు అందించవలసిందిగా కోరుతున్నాం. ధన్యవాదాలతో...

బి.మోతి మోహనరంగా,
సూర్యాపేట.

'చేసేద్దాం'...బావుంది

రెంటాల జూనియర్ అట్టమీదికథలో వాస్తవ సినీ సంగతులను ఏకరువు పెట్టారు. 'బాలనేస్తాలు' పేజీలలో... చేసేద్దాం.. అంశం బావుంది. పాటమీద మోజు గాడిద చావుకు రావటం బాధకలిగించినా చక్కని నీతి తెలుసుకునే అవకాశం కలిగినట్లయింది. ఎందరో ఒబామాలు ఒక్క 'ఓబామా'కే వందనాలు. రసీదులు ఎంత పద్ధతిగా భద్రరుచుకోవాలో 'వికాసం' ద్వారా తెలియజేసిన 'మైత్రి'కి ధన్యవాదాలు. అడిగోపుల వెంకటరత్నం శ్రీనివాసరావు, ప్రసన్నలక్ష్మి కవితలు భావగర్భితంగా ఆకట్టుకున్నాయి. ఓపెన్ ఆఫీస్ గురించి తెలియజేసిన రాజుగారికి థ్యాంక్స్... 'తెల్సా'...లో బడా బుక్ భలేగా ఉంటే వేళ్ల బ్రిడ్జి గమ్మత్తుగా ఉంది. స్పందన (చిన్నకథ), సమాధానం కథలు బావున్నాయి. రచయితలకు అభినందనలు. టీవీ వల్ల నష్టాలెవరికీ లాభాలెవరికీ! "మనలో మాట" ఎవరివైపో?

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

మంచి వివరణ

మనకు జ్ఞానము, సంస్కారము నేర్పే గ్రంథాలయాలను స్థాపించడానికి 21వ శతాబ్దంలో కృషి చేసిన మహానుభావులు, మహాతల్లుల ఎందరి గురించో చక్కగా వివరించారు. కామ్రేడ్ లావు బాలగంగాధరరావుకు స్ఫూర్తినిచ్చిన పుస్తకాల సమాచారాన్ని చక్కగా వివరించారు. వియత్నాం వీరుడు సీరియల్ బాగా నడుస్తోంది. అందరికి ఆసక్తి కలిగించే యార్లగడ్డ ఫొటోలు చక్కగా ఇచ్చారు.

మోటూరు
సూర్యనారాయణమూర్తి,
విశాఖ పట్నం.

ఒబామా రూపాలు... తమాషాలు!

ఈవారం మాటలకోటను మా ఆవిడ కలం దించకుండా రెండు నిముషాల్లో పూరించింది. గాడిదపాట, ఒబామా మారు రూపాలు... తమాషాగా ఉన్నాయి. రశీదు ఫైల్స్ అవసరమా, బృహదీశ్వరాలయ గోపుర వైభవం బాగుంది. సినిమా సీన్లు బాగున్నాయి.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

తప్పక చదవాలి

అమెరికన్ రచయిత అభ్యుదయ వాది, విద్యావేత్త లియో హ్యూబర్‌మన్ 1967లో ఇంగ్లీషులో రాసిన ఎబిసి ఆఫ్ సోషలిజంకు తెలుగు అనువాదం సోషలిజం ఓనమాలు. కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించిన రచయిత పెట్టుబడి దారుల దోపిడీకి గురైన వ్యక్తి కనుక ఈ గ్రంథరచనను అంత బాగా చేశారు. ఉద్యమకారులందరు చదవదగిన పుస్తకం. సోషలిజాన్ని అవహేళన చేస్తున్నవారు, వక్రీకరించిన వారు ఈ పుస్తకాన్ని తప్పనిసరిగా చదవాలి. ఇటువంటి పుస్తకాన్ని పరిచయం చేసిన అజయ్‌కుమార్‌గారికి అభినందనలు.

టి.శ్రీరామ్మూర్తి,
గాజువాక, విశాఖ.

చక్కటి 'సమాధానం'

అజయ్‌కుమార్‌గారు కుటుంబసభ్యుల వల్ల స్ఫూర్తి ఎలా పొందారో 'సోషలిజం ఓనమాలు' పుస్తకం చదివి అలాగే స్ఫూర్తి పొందారు. 'సోషలిజం ఓనమాలు' చదివినందువల్ల మిగులు విలువ గురించి తెలుసుకోగలిగారు. బృహదీశ్వరాలయం గురించి చక్కగా రాశారు. అయితే ఈ గుడిలోని దేవుళ్లను రాజులు, రాణులు మాత్రమే పూజించేవారు. అంటే పాలకులు పూజించడానికన్నమాట. ఇది ప్రజల పూజకు సంబంధించింది కాదు. ప్రజలు పూజించే గుళ్లు తంజావూరు నిండా వున్నాయి. అబ్దుల్ వహీద్‌ఖాన్ గారు ఇందిరమ్మ పథకం అప్పుల వల్ల చిన్నకారు రైతులు ఆత్మహత్యలతో పాటు వారి కుటుంబాలు నాశనమైపోవడాన్ని చూపించారు. అలాగే వలస కార్మికులను పనిపాట్ల కోసం తీసికెళ్లే కాంట్రాక్టర్లు మనుషులను



తీసికెళ్ళేటప్పుడు జరిగే విపత్తుల గురించి 'సమాధానం' కథ చక్కగా చెప్తుంది.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారిపేట, విజయవాడ.

వింత గోపురం

బృహదీశ్వరాలయ గోపురం విశేషాలు, వింతలు ఆకర్షించాయి. ఎంత ఎండ కాస్తున్నా గోపురం నీడ భూమిపై పడకపోవడం నిజంగా వింత. ద్రావిడ వాస్తు పద్ధతిలో 216 అడుగుల ఎత్తుగల బృహదీశ్వరాలయ గోపురం శిల్పకళకు వాసికెక్కింది. విగ్రహ నిర్మాణానికి పూనుకొన్న ఈ మహారాజు ధన్యుడు. ఇది యాత్రికులు తప్పక సందర్శించవలసిన ప్రముఖ దేవాలయం.

ఆచార్య నూతి నారాయణరావు,
హైదరాబాద్.

★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

క్షీరాన్నము

తయారు చేసే విధానం

కొత్తబియ్యం - 400 గ్రాములు, చిక్కనిపాలు - 2 కప్పులు, పంచదార - 400 గ్రాములు, నెయ్యి - 6 టేబుల్‌స్పూన్లు, జీడిపప్పు - 2 టేబుల్ స్పూన్లు, ఎండుద్రాక్ష - 2 టేబుల్ స్పూన్లు, పిస్తాపప్పు - 2 టేబుల్ స్పూన్లు, కుంకుమ పువ్వు - కొద్దిగా, యాలకులపొడి - కొద్దిగా, జాపత్రి - కొద్దిగా, జాజికాయ - కొద్దిగా

తయారు చేసే విధానం

ముందుగా జీడిపప్పు, ఎండుద్రాక్ష, పిస్తాలను కొంచెం నెయ్యిలో వేయించి పక్కన పెట్టుకోవాలి. అలాగే కొంచెం పాలను ఒక పాత్రలో వేడిచేసి, వెచ్చబడిన తరువాత అందులో కుంకుమపువ్వు, జాపత్రి, జాజికాయపొడులను కలిపి నానబెట్టాలి. తరువాత మిగిలిన పాలలో నాలుగు కప్పులను పక్కన పెట్టుకుని మిగిలిన పాలను బరువుగల పరిశుభ్రమైన ఇత్తడి పాత్రలో పోసి స్టౌమీద మరగించాలి. ఈలోగా బియ్యం శుభ్రంచేసి, నీళ్ళలో బాగా కడగాలి. పాలు బాగా మరగడం ప్రారంభించగానే కడిగిన బియ్యాన్ని పాలల్లో పోసుకోవాలి. బియ్యం మెత్తగా ఉడికేంత వరకు స్టౌను మీడియం సెగలో మండించాలి. మధ్యలో అప్పుడప్పుడూ గరిటెతో కలియబెడుతూ వుండాలి. బియ్యం ఉడుకుతున్న సమయంలో పాలు ఇగిరిపోతుంటే వేరుగా వుంచుకున్న పాలను పోసి కలుపుతూ వుండాలి.

బియ్యం ఉడికిన తరువాత సెగ తగ్గించి కొద్ది కొద్దిగా పంచదార కలుపుతూ వుండాలి. పంచదార పూర్తిగా కరిగిన తరువాత, యాలకులపొడిని కలిపి, ఒకసారి మొత్తం మిశ్రమాన్ని గరిటెతో బాగా కలియబెట్టి, పాత్రను స్టౌ మీద నుంచి కిందకు దించుకోవాలి. తరువాత అందులో నేతిలో వేయించి సిద్ధంగా వుంచుకున్న జీడిపప్పు, ఎండుద్రాక్ష, పిస్తాలను పాలలో నానబెట్టిన కుంకుమపువ్వు, జాపత్రి, జాజికాయ పొడులను వేసి గరిటెతో కలపాలి. చివరిగా మిగిలిన నెయ్యిని వేడి చేసి మిశ్రమంలో కలపాలి. దీనితో మధురాతి మధురమైన క్షీరాన్నం రెడీ. దీనిని వేడి వేడిగా ప్లేట్లలో పెట్టి అతిథులకు అందించొచ్చు. క్షీరాన్నం తయారీలో పంచదార బదులుగా మెత్తని కలకండ, లేదా బెల్లం కోరును వినియోగించవచ్చు. అలాగే చిక్కటి పాలకు బదులు పాలు, నీరు సమానంగా కలిపి ఉపయోగించవచ్చు.

పొంగలి

కావలసిన వస్తువులు

కొత్తబియ్యం - 2 కప్పులు, పాలు - 20 కప్పులు, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానము

ముందుగా పదహారు కప్పుల పాలను ఇత్తడి పాత్రలో పోసి బాగా మరిగించాలి. ఈ లోపు బియ్యం శుభ్రంగా కడిగి, మరుగుతున్న పాలల్లో కలపాలి. అప్పుడప్పుడూ గరిటెతో కలియబెడుతూ, అన్నం మెత్తగా ఉడికేంతవరకు స్టౌను మీడియం సెగ మీద వుంచాలి. అన్నం ఉడికే సమయంలో పాలు ఇగిరిపోతున్నట్లయితే మిగిలిన నాలుగు కప్పుల పాలను అవసరం మేరకు కలుపుకోవాలి. అన్నం మెత్తగా ఉడికి, పాలు పూర్తిగా ఇగిరిపోయిన తరువాత పాత్రను స్టౌ మీద నుంచి కిందకు దించి, మెత్తని ఉప్పు వేసి బాగా కలియబెట్టాలి. రుచికరమైన పాల పొంగలి రెడీ. ఈ పాలపొంగలిని సాంబారు లేదా కొత్తిమీర చట్నీలతో అతిథులకు వేడివేడిగా వడ్డించాలి. పాతబియ్యంతో పాలపొంగలి చేసినట్లయితే పాలు ఎక్కువగా కలపాలి. ఒక లీటరు పాలకు మూడు కప్పుల నీళ్ళను కలపవచ్చు. ఎక్కువ సమయం పాలలో ఉడికిన అన్నం చాలా చాలా రుచిగా వుంటుంది.

స్వీట్‌రైస్

కావలసిన వస్తువులు

బియ్యం - 400 గ్రాములు, పంచదార - 100 గ్రాములు, నెయ్యి - 4టేబుల్ స్పూన్లు, శొంఠిపొడి - 2 స్పూన్లు, జీడిపప్పు - 25 బద్దలు

తయారు చేసే విధానం

ముందుగా జీడిపప్పును కొంచెం నేతిలో దోరగా వేయించి తీసుకోవాలి. తరువాత అన్నం పొడిగా వండి, వెడల్పుగా వున్న పళ్ళెంలో పరచాలి. అన్నం వేడిగా వుండగానే కలిపి బాగా కలియబెట్టాలి. దీనితో ఆరోగ్యదాయకమైన రుచికరమైన స్వీట్ రైస్ రడీ. దీనిని పావుగంట గడిచిన తరువాత ఏదైనా సాస్ లేదా జామ్‌లతో కలిపి లాగించాలి. ఇది ఘాటుగా తియ్యగా వుంటుంది.

గమనిక : శొంఠిపొడి కోసం శొంఠి ముక్కను వేయించి మిక్సీలో పొడిగా చేసుకుని జల్లించుకోవాలి.

చక్కెర పొంగలి

కావలసిన వస్తువులు

బియ్యం - గ్రాములు, పెసరపప్పు - 100 గ్రాములు, బెల్లం కోరు - 2 1/2 కప్పులు, నెయ్యి - 1/2 కప్పు, జీడిపప్పు - 2 స్పూనులు, ఎండుద్రాక్ష - 2 స్పూన్లు, యాలకులపొడి - 1/2 టీ స్పూను

తయారు చేసే విధానం

ముందుగా పెసరపప్పును పొడిగా బాణలిలో కొద్దిసేపు వేయించి పక్కన పెట్టుకోవాలి. తరువాత బాణలిలో కొంచెం నెయ్యి పోసి, కాగిన తరువాత జీడిపప్పు ముక్కలను, ఎండుద్రాక్ష పళ్ళను వేసి, వేయించి పక్కన పెట్టుకోవాలి. తరువాత బియ్యంను శుభ్రంగా కడిగి, కుక్కర్ పాత్రలో వేసి, అందులో వేయించిన పెసరపప్పు, తొమ్మిది కప్పుల నీళ్ళు కలిపి పది నిమిషాలపాటు మెత్తగా ఉడికించాలి. తరువాత స్టౌమీద వెడల్పాటి బాణలి వుంచి, అందులో ఒక కప్పు నీళ్ళు పోసి మరిగించాలి. అందులో బెల్లం బాగా కరిగిన తరువాత బాణలిని స్టౌ మీద నుంచి కిందకు దించి, పాకాన్ని వడకట్టి అందులోని మురికిని తొలగించాలి. తరువాత బాణలిని శుభ్రంగా కడిగి, అందులో బెల్లం పాకాన్ని మళ్ళీ పోసి, లేతపాకం వచ్చేంత వరకు మరిగించాలి. బాణలిలో బెల్లం పాకం లేతపాకంగా మారిన వెంటనే అందులో ఉడికించి సిద్ధంగా వుంచుకున్న బియ్యం, పెసరపప్పుల మిశ్రమాన్ని వేసి, మీడియం సెగ మీద రెండు నిమిషాలు గరిటెతో కలియబెడుతూ ఉడికించి, బాణలిని స్టౌమీద నుంచి కిందకు దించుకోవాలి. తరువాత ఇందులో నేతిలో వేయించి సిద్ధంగా వుంచుకున్న జీడిపప్పు ముక్కలు, ఎండుద్రాక్షలను, యాలకులపొడిని వేడి చేసిన నెయ్యిని వేసి బాగా కలియబెట్టాలి. దీనితో నోరూరించే చక్కెరపొంగలి రెడీ. చక్కెర పొంగలి తయారీకి బెల్లం కోరుకు బదులుగా పంచదారపొడిని కూడా ఉపయోగించవచ్చు.


క్షీరాన్నం


స్వీట్ రైస్

పొంగలి


చక్కెర పొంగలి

స్ఫూర్తి

- కత్తి పద్మారావు,
ప్రముఖ రచయిత.

జ్వాల రగిల్చిన జాషువా కవిత్వం

మహాకవి జాషువా నా కవిత్వానికి మార్గదర్శకుడయ్యాడు. నా దృక్పథానికి పదును పెట్టాడు. నేను మహాకవి జాషువా కవిత్వాన్ని సమకాలీనంగా మలచుకుంటున్నాను. శక్తివంతం చేసుకుంటున్నాను. భిన్నమైన వ్యక్తీకరణను ఆవాహనం చేసుకుంటున్నాను. ఆనాటికి జాషువాకున్న పరిమితుల్ని దాటి విస్తృతపరుస్తున్నాను. అయినా నా కవితా మార్గానికి దిక్సూచిని రూపొందించింది, భావ సంపత్తిని కూర్చింది మహాకవి జాషువానే. ఈనాటి దళిత కవిత్వం జాషువా కంటే విస్తృతమవ్వొచ్చు. తాత్వికంగా ఇంకా పదును తేవచ్చు. అయితే ఒక ప్రత్యామ్నాయ కవితా మార్గాన్ని నిర్మించి బాటవేసిన మహాకవి జాషువానే నా కవితా గురువు.



1960-70 దశకాల్లో కవితాపరంగా మహాకవి గుర్రం జాషువాగారికి మంచి ప్రశస్తి వుండేది. జాషువా కవితాముద్ర నా మీద బలంగా పడింది. నా ఉపన్యాసాల్లో, వ్యాసాల్లో పుస్తకాల్లో మహాకవి జాషువా గారి పద్యాలు సందర్భోచితంగా వాడుతుండేవాడిని... జాషువా పద్యాలకు ప్రజల్లోకి చొచ్చుకుపోయే గుణముండేది. జాషువాకి ముందు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి తమ అవధానాల ద్వారా ప్రజల్లోకి పద్యాన్ని తీసుకువెళ్లారు.

నేను సంస్కృత కళాశాలకు 1971లో వచ్చాను. ఆయన ఆ సంవత్సరమే మరణించారు. కాని సాహితీ లోకంలో ఆయనకున్న విస్తారమైన కీర్తి వల్ల నేను ఆయన్ని చదవడం ప్రారంభించాను. నిజానికి అప్పటికి మా 'భాషా ప్రవీణ' సిలబస్‌లో ఆయన పాఠ్యాంశం లేదు. కాని ఆయనకున్న ప్రశస్తి ఆయన వూరు వినుకొండ దగ్గర చాట్రగడ్డపాడు, కొండ అడవికి దగ్గరలో ఉంది. ఆయన కవిత్వంలోని జంతువులపై ఆయనకున్న ప్రేమ విశ్వ మానవ సంస్కృతీ భావనకు దారి తీశాయి. ముఖ్యంగా ఆయనలోని జీవ కారుణ్యం పుస్తకాల నుండి రాలేదు. జాషువా ముందు చిత్రలేఖకుడు. చూసిన బొమ్మను చూసినట్టు గీసేవాడు. ఆయనకు...లలిత కళల పట్ల బలమైన అభిరుచి/ చిన్నతనమునంటే చిగురు వెట్టి/ లీలనెదిగి చిత్రలేఖనమ్ముగమారి/ కట్టకడకు తెలుగు కవనమయ్యే..

అని ఆయన తన కవితా మూలం గురించి కవనం చెప్పారు. జాషువా కవితలో చిత్రలేఖనం అంతర్గర్భితంగా వుండేది. ముందు చిత్రాన్ని వూహించి తరువాతే కవనం చెప్పేవాడు. ముఖ్యంగా ఛందస్సు మీద పట్టు సాధించాడు. ఛందస్సులో రాయడం అంత తేలికైన పనికాదు. ఛందస్సుతో పాటు, ప్రాస, యతులను పాటించాలి. చిన్న పొరపాటు వచ్చినా ఛందో పండితులు కుటిల వ్యాఖ్యానాలు చేస్తారు. జాషువాగారు మంచి వక్తగా ఎదగడానికి ఆయన పద్యం చదివే పద్ధతే ముఖ్య కారణం. ఎంతమంది వేదిక మీద వున్నా ఆయనకే ఎక్కువ గౌరవం వుండేది. కారణం ఆయనలోని వ్యక్తిత్వమేనని కొండవీటి వేంకటకవిగారు పదే పదే చెపుతూ వుండేవారు.

జాషువాగారి జీవిత ఘట్టాలను ఆయన కుమార్తె హేమలతా లవణంగారు చాలా కథనాత్మకంగా చెప్పేవారు. 2008లో జాషువ విగ్రహాన్ని చీరాలలో ఆవిష్కరించినప్పుడు ఆమె తన జీవితం ధన్యమయ్యిందని అన్నారు. జాషువాకు నేను కూతుర్ని అయితే నా తమ్ముడు పద్మారావు కుమారుడు అని జాషువా కవితా వారసుడు కూడా అని అనడం ఆమె నిజాయితీకి నిదర్శనం.

నామీద జాషువ జీవిత ప్రభావం కంటే ఆయన కవిత్వ ప్రభావమే ఎక్కువపడింది. జాషువగారు ఛందస్సులో రాసినా అది పాటలానే వుంటుంది. ఆ శైలిలో చాలామంది కవులు పాడటం ప్రారంభించారు. అందుకే 1946లో చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి ఆయనకు గండపెండేరం తొడిగారు. నవయుగ కవి చక్రవర్తి బిరుదు ప్రదానం చేయడం జరిగింది.

ఆయన రచనల్లో విశిష్టమైన 'గబ్బిలం' నన్ను ఆకర్షించింది. నా నిత్య జీవన పఠన గ్రంథంగా మారింది. నేను చిన్నప్పుడు బైబిల్ ఎంత ప్రగాఢంగా చదివానో తరువాత 'గబ్బిలాన్ని అంత లోతుగా చదివాను. నా కవిత్వానికి ఒక భావజాలాన్ని, దిక్సూచిని గబ్బిలం అందించింది. సాటి మానవుడు అస్పృశ్యుడుగా తోసి వేయబడడానికి కారణాల్ని అన్వేషించేటట్టు చేసింది. కేవలం కవిత్వంలోనే కాక సామాజిక చరిత్ర అధ్యయనానికి, దళితుల చరిత్ర రచనకు నా 'గబ్బిలం' తోడు నడిచింది. నిజానికి 'దళిత భారతమే' గబ్బిలం అనవచ్చు. 'గబ్బిలం'లో మహాకవి జాషువాగారు.

ఆలయమ్మున నీవు వ్రేలాడు వేళ/ శివుని చెవినీకు కొంత చేరువగనుండు/ మౌనిఖగరాజ్ఞి! పూజారి లేని వేళ/ విన్నవింపుము, నాదు జీవిత చరిత్ర... అన్నారు.

'గబ్బిలం' అనే పేరు కావ్యానికి పెట్టడం ఒక సాహసం, పూజారి లేనివేళ ఖగరాజ్ఞినాదు జీవిత

గాథ వినిపించుము అని చెప్పడం. అందునా శివునికి విన్నవించడం. అద్భుతమైన నూతన సృష్టి. రామాయణ భారతాలను తిరిగి తిరిగి రాస్తూ విశ్వనాథ సత్యనారాయణ గారి వంటి వారు సమాజాన్ని వెనక్కు తీసుకు వెళ్లాలని ప్రయత్నిస్తున్నప్పుడు 'అంటరానివాని' జీవిత గాథను కావ్యంగా రాయడం. అది ప్రతి హృదయాన్ని తట్టి లేపేదిగా ఉండటం ఆశ్చర్యకరమైన విషయం. ఇందులోని ప్రతి పద్యం నన్ను ఆకట్టుకొంది. నా జీవితం మీద ప్రగాఢమైన ముద్ర వేసింది.

"కసరి బుస గొట్టునాతని గాలిసోక/ నాల్గుపడగల హైందవ నాగరాజు!" అనడంలో ఈ చాతుర్వర్ణాలను కాటువేసే నాగరాజుగా వర్ణించడంతో దళితుల పట్ల వీరి అక్కసును కవితాత్మకంగా చెప్పగలిగాడు కవి. జాషువా ప్రతిభా సామర్థ్యం వస్తువును ఎన్నుకోవడంలోనే గాక వస్తు విస్తృతిలోనూ వుంది. గబ్బిలానికి నివేదనలో మొత్తం భారతదేశంలోని ముఖ్య క్షేత్రాలన్ని వర్ణించి వాటి నిర్మాణంలో దళితుల పాత్ర వుందని చెపుతాడు. చరిత్ర కొత్త కోణంలో జాషువా చూశాడు. జాషువా కవిత్వం చదవక ముందు నా కవిత్వం క్రైస్తవపాటలతో ప్రారంభమైంది. తరువాత హేతువాదంలో సాగింది. నా కవిత్వంలో కుల నిర్మూలనా భావం జాషువా వల్లనే.

జాషువా ప్రకృతి వర్ణనలు అసమాన్యమైనవి. ఆయన చిన్నతనం నుండి ప్రకృతిని నిశితంగా చూశాడు. అడవి దగ్గరగా వుండటం వల్ల ప్రకృతిలోని అభేదాన్ని చూశాడు. అలాగే సమాజంలో భేదాలు చూశాడు. నేను కూడా చీరాలలో పెరగడం వలన అక్కడ సముద్రానికి ఎక్కువగా వెళ్లడం వలన ఆ ప్రకృతి రమణీయత నా కవిత్వంలో ఎక్కువగా చోటు చేసుకొంది. ప్రకృతిని మానవ సమాజానికి పోల్చడంలోనే కవితా సామర్థ్యం వుంటుంది.

కవి లోభి అయితే ఎంత నికృష్టుడవుతాడో నేను స్వయంగా కొందరు కవులను చూసి తెలుసుకున్నాను. జాషువా ముద్ర ఈ విషయంలో నా మీద బలంగా వుంది. అదనపు జ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికే అదనపు ధనాన్ని ఉపయుక్తం చేయాలనే సూత్రాన్ని నేను ఆచరించాను. కవులు, కళాకారులు ఎందరో తాము బాగా ఆర్జించేటపుడు వెలిగిపోయి అవసాన దశలో ఇబ్బందులు పడటం జరిగింది. దళితుల్లో ఇది మరీ ఎక్కువ. అయితే జాషువా ఉదారంగా ఉండేవాడని ఆయన సహచరులు అందరూ చెబుతారు. గుంటూరులో పౌర సన్మానం చేసి ఇల్లు కట్టించి ఇచ్చేవరకు తనకు ఇల్లు లేదు. కులం గీసుకున్న గీతలను జాషువా చెరిపివేయడమే గాక, ఆ స్ఫూర్తిని అందుకునే చైతన్యం మాకిచ్చాడు. నిజంగా నేను కులాన్ని వందకి వంద నమ్మకపోవడానికి కారణం ఈ దిశగా జీవితాచరణకు పూనుకోవడానికి కారణం అంబేద్కర్, జాషువాలే అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పుడు అణగారిన కులాల్లో కులం స్పృహ పెరగడం ఆశ్చర్యం. ప్రభుత్వం ఇచ్చే రాయితీల కోసం కులం కార్డును ఉపయోగించడం అధికమవుతోంది. దళితుల్లోనే ఉపకులాలు పెండ్లి చేసుకోవడానికి సిద్ధంగా లేరు. సమాజం మారాలన్నప్పుడు ఎంత క్లిష్టమైన మార్పుకైనా సిద్ధపడవలసి వుంది. మా కుటుంబంలో కులాంతర వివాహం చేసుకుని కుల నిర్మూలన బాటలో నడిచామంటే జాషువాగారి పద్యాల ప్రభావం, అంబేద్కర్ ఆలోచనల ప్రభావం వల్లనే జరిగింది.

ఆయన రచనల్లో విశిష్టమైన 'గబ్బిలం' నన్ను ఆకర్షించింది. నా నిత్య జీవన పఠన గ్రంథంగా మారింది. నేను చిన్నప్పుడు బైబిల్ ఎంత ప్రగాఢంగా చదివానో తరువాత 'గబ్బిలాన్ని అంత లోతుగా చదివాను. నా కవిత్వానికి ఒక భావజాలాన్ని, దిక్సూచిని గబ్బిలం అందించింది. సాటి మానవుడు అస్పృశ్యుడుగా తోసి వేయబడడానికి కారణాల్ని అన్వేషించేటట్టు చేసింది. కేవలం కవిత్వంలోనే కాక సామాజిక చరిత్ర అధ్యయనానికి, దళితుల చరిత్ర రచనకు నా 'గబ్బిలం' తోడు నడిచింది. నిజానికి 'దళిత భారతమే' గబ్బిలం అనవచ్చు.

విశ్వనరుడుగా జీవనం కొనసాగించడం భారత భూమికపై చాలా కష్టమైన విషయం. మనిషి కుల చట్రంలో నుండి బయటకు వచ్చి ఇతరుల ప్రతిభను చూడగలిగిన స్థాయి తక్కువ. మేము సంస్కృత కళాశాలలో చదివేట్పుడు ఎదురైన అనేక చేదు అనుభవాలను జాషువాగారిచ్చిన స్ఫూర్తితోనే ఎదిరిస్తూ ముందుకు నడిచాము. ఆయన 'నేను'లో రాసిన కవితా కుసుమాలు ఆయన జీవిత పరిమళాన్ని వెదజల్లాయి.

"తల్లిదండ్రి లేని బిడ్డల జూచి కన్నీరు/ దానంబు చేయు నేత్రములు నావి/ జంతుకోటికి గల్గు స్వామి భక్తిని మెచ్చి/ తృప్తి జెందెడు నవ్య దృష్టి నాది (అదే పుస్తకం పేజీ 156). జాషువాది కరుణార్ద్ర హృదయం. 'తల్లిలేని పిల్లలను చూసి ఆయన 'కన్నీరు దానం' చేసే హృదయం కలిగి వున్నాడు. లోకంలో కన్నీరు మృగ్యమవుతుంది. తల్లి మరణించినా ఏడవని వారు మనకు కనిపిస్తున్నారు. కళ్ళు ఆర్ద్రమవడం మరచిపోయి రాళ్ళలా కొందరు జీవిస్తున్నారు. నిజానికి కారంచేడు ఉదంతంలో అక్కడి శవాలను చూసి కొన్ని రోజులు నాకు కళ్ళ నీళ్ళు స్రవిస్తూనే ఉన్నాయి. దుఃఖం పొంగి పొర్లింది. అప్పటికప్పుడు వారిని ఆదుకోవాలనే ఆ సమరంలోకి దూకడం జరిగింది. కరుణార్ద్రుడు కాని మనిషి మనిషే కాదు. కవిత్వం, జీవితము వేరు కావు. రెండూ పెనవేసుకునే వుంటాయి. ఇంకా దళితవాడల్లో ఈ కన్నీరు వుంది. దళితుల్లో వెలుగు, చీకటి రెండు బ్రతుకుతున్నాయి. అందుకే దళితుల్లో కవులెక్కువ జనిస్తున్నారు. కన్నీటికి అక్షర రూపం ఇస్తున్నారు.

కవి, కవిత్వాన్ని ప్రజలకందించే దారిలో ఎన్నో ముళ్ళ కంచెలు వుంటాయి. వాటిని గుండె ధైర్యంతోనే ఎదుర్కొన్నాడు జాషువా. దళిత కవులందరికీ ఈ వ్యతిరేకతలు ఉంటాయి. బ్రాహ్మణవాదం బ్రతుకునందే వైవిధ్యాలు సృష్టించడం వల్ల జాషువా వీటినన్నింటిని సమర్థవంతంగా ఎదుర్కోవడం మాకూ నేర్పాడు.

గవ్వకు సాటిరాని పలుగాకుల
మూకలసూయ చేతన/ నెవ్విధి దూరినన్ నను
వరించిన శారద లేచిపోవునే!/
ఇవ్వసుధాస్థలింబొడమ రే రసలుబ్బులు?
గంటమునెదన్/ రవ్వలు రాల్చెదన్ గరగరల్
సవరించెదనాంధ్ర వాణికిన్ (అదే పుస్తకం 118)

అన్నాడు. ఈ పద్యంలో శత్రువును ఎదిరించడమే గాకుండా ఒక ధీరోదాత్తత కనిపిస్తుంది. సమకాలీనంలో కాని ఆ తరువాత గాని జాషువా అంత బలమైన కవి 'అగ్ర'వర్ణంలో ఆవిర్భవించలేకపోయారు. ఇక్కడే జాషువా ప్రభావం నామీద పడింది. జాషువాలోని ధిక్కార స్వభావం తరువాత దళిత కవి లోకంలోకి స్రవించింది. అందుకే 'జాషువా – దళిత సాహిత్యవాదం' అనే గ్రంథాన్ని సిద్ధాంతీకరించాను.

మహాకవి జాషువా తన జీవిత ప్రస్థానాన్ని సత్య నిష్ఠంగా సాగించాడు. కవిత్వం కేవలం భావకవిత్వమో, ఉద్రేకపరిచేదో, శృంగార భరితమైందో కాక అట్టడుగునున్న జీవన చైతన్యాన్ని మేల్కొల్పేదిగా ఉండాలి. కవిత్వానికి తప్పక మార్గదర్శకత్వం కావాల్సి వుంది. మహాకవి జాషువా నా కవిత్వానికి మార్గదర్శకుడయ్యాడు. నా దృక్పథానికి పదును పెట్టాడు. నేను మహాకవి జాషువా కవిత్వాన్ని సమకాలీనంగా మలచుకుంటున్నాను. శక్తివంతం చేసుకుంటున్నాను. భిన్నమైన వ్యక్తీకరణను ఆవాహనం చేసుకుంటున్నాను. ఆనాటికి జాషువాకున్న పరిమితుల్ని దాటి విస్తృతపరుస్తున్నాను. అయినా నా కవితా మార్గానికి దిక్సూచిని రూపొందించింది, భావ సంపత్తిని కూర్చింది మహాకవి జాషువానే. ఈనాటి దళిత కవిత్వం జాషువా కంటే విస్తృతమవ్వొచ్చు. తాత్వికంగా ఇంకా పదును తేవచ్చు. అయితే ఒక ప్రత్యామ్నాయ కవితా మార్గాన్ని నిర్మించి బాటవేసిన మహాకవి జాషువానే నా కవితా గురువు. ★

ప్రాణం

రాత్రంతా చెలరేగిన
ఇసుక తుఫానులో
నీ జ్ఞాపకాలు ఏరుకొంటూ
కెరటాల గుంపులాంటి
జన సందోహాలను కలిసి
ఒక కరవాలం మెరుపుకోసం
అలల కదలికలను వరాలడిగాను

యుద్ధరంగం నుంచి వచ్చిన ఉత్తరాన్ని
చించుతూ అతుకుతూ
ఎగరలేని పక్షుల రెక్కలు దువ్వాను

గాయాలు రాలిన చోట
కోటగోడలు కూలిన చోట
నెత్తురూ కన్నీళ్ళూ కలిపి
కత్తి మొన మీద
దీపాలు వెలిగించాను

కార్యాను బయలుదేరిన చోట
కల్లోలం మొదలయింది
కంజీర అలికిడి విని
మేఘం బద్దలయింది
అలసిన నేత్రాలు
జలతారు తీగలల్లుకొని
కురిసిన కలల జల్లుల తడిలో
నేల కొత్తగా మొలకెత్తింది

శ్రమజీవుల పాటలు
నదులను మలుపు తిప్పాయి
బాణాలూ, పద్యాలూ, వేరు వేరు కాదు



పర్వతాలు కూలినా, సముద్రాలు పొంగినా
మొదలుపెట్టిన ప్రస్థానం
దిగంతాలదాకా సాగుతోంది.

కాలిబాటల్లో నిలిచిన
నెమలీకల ప్రతిబింబాల్లో
మరో ప్రపంచం వెలుస్తోంది

చాలా వరదలొచ్చాయి
వివాదాలొచ్చాయి
వాదాలొచ్చాయి
ఈదురు గాలులు వీచాయి
మనస్పర్థలు పెరిగాయి
గడ్డివాము అంటుకొని, అలముకొని
కాలి బూడిదయింతర్వాత,
అడుగున మట్టి మిగిలింది
మట్టి పరిమళం మనిషి పరిమళం కలిసి
కవిత్వానికి దిక్సూచి అయింది

నువ్వు ఊహించిన చిత్రం అబద్ధం కాదు
చల్లిన విత్తనం ఊరకపోదు
ఆటుపోట్లు అలా వచ్చి వెళ్లాయి
వొడ్డుమీది పిల్లనగ్రోవి కొట్టుకుపోలేదు
నువ్వు వేసిన వంతెన మీది నుంచే
కందకాలను దాటుతున్నాను.

మాటలు నేర్చుకునే క్రమంలో
మనసులు కూర్చుకునే కాలంలో
రెపరెపలాడే పుస్తకంలోని పేజీలు
ఎక్కడైనా మడత పడ్డాయేమోకాని
ఒక్క అక్షరంకూడా కింద పడిపోలేదు

నువ్వు కవిత్వాన్ని ప్రాణం చేశావు
మనిషికి ఒక గమ్యం చూపావు
మేము నిన్ను బతికించుకుంటాం
ప్రశ్నించడం నేర్చుకొని, ఓర్చుకొని
బతుకును కాపాడుకుంటాం.

(శ్రీశ్రీ కి సలాం!)

- ఆశారాజు

కవిత్వమ్

నిశ్శబ్ద స్వరూపం

నాకు జ్ఞాపకమే
ఆ రోజు, ఆ సమయం,
ఆ ఘడియ ఆ రుతువు, ఆ రుతువు సుగంధం
నాకు జ్ఞాపకమే
నా మనసూ తనువూ వెదజల్లిన కోర్కెలు
లోన కదలాడే మెత్తని బాధ

నాకు జ్ఞాపకమే
నా జీవితపు ఇసుక రేణువులు
నా పిడికిటి వేళ్ళ మధ్యలోంచి
ఎలా రాలిపోయిందీ జ్ఞాపకమే
సూర్యచంద్రులు, ప్రకాశహీనులై
చిక్కని చీకట్లు నిన్నెలా కబళించింది

నాకు జ్ఞాపకమే
ఎండిన శూన్యపు లయల మధ్య
నా ఆత్మ సజీవంగా దేన్నో వెతుక్కుంటూ ఏదో

నేర్చుకుంటూ తిరగడం

ఒంటరిగా, నిశ్శబ్దంగా
వెళ్లి కూర్చుంటాను
సంతాపం వెలిబుచ్చడానికి
సజీవంగా ఉన్న నా శవం పక్కన
తమ విచారం ప్రకటిస్తూ
జ్ఞాపకాలు కూడా వస్తాయి.
తమ ప్రేమను ప్రదర్శిస్తాయి
కుమిలిపోతాయి, బిగ్గరగా ఏడుస్తాయి

నేను నిశ్శబ్ద స్వరూపాన్నవడం
నాకు జ్ఞాపకమే!

పంజాబీ కవయిత్రి : ప్రభుజోత్ కౌర్

తెలుగు: **డా॥ దేవరాజు మహారాజు**

కారంత గుమ్మడికాయ



నిజమేనండీ బాబు. అయినా సైజ్ చూస్తే తెలియట్లా! 17 అడుగుల వెడల్పున్న ఈ గుమ్మడికాయ ఫియట్ 500 కారంత బరువుందట. దీన్ని చూసి అలా నోరు తెరిచేశారా! అయితే కాస్త ఆగండి. ఈ గుమ్మడికాయ తన భారీ సైజుతో రెండు రికార్డులను బద్దలు కొట్టేసిందట. చూడండి రెండేళ్ల పాప దాని మీద నిలబడితే ఎంత చిన్నగా వుందో! దాన్నిబట్టే గుమ్మడి సైజును అంచనా వేయగలగాలి.

తెలుసా!

ధర్మామీటర్ మనిషి

ఫొటోలో కనిపించే వ్యక్తికి అసలు పెద్దలు పెట్టిన పేరు మరుగున పడిపోయి ధర్మామీటర్ మనిషిగా వెలుగొందుతున్నాడు. అసలు పేరు రిచర్డ్ టి పోర్టర్. ముద్దు పేరు మాత్రం ధర్మామీటర్ మ్యాన్. ఇప్పటికి ఆయన దగ్గర 5 వేలకు పైగా ధర్మామీటర్లు వున్నాయి. ఏం చేద్దాం. ఒక్కొక్కరికి ఒక్కో హాబీ వుంటుంది. ఈయనది ధర్మామీటర్లను సేకరించే హాబీ. అలా పోగేసిన ధర్మామీటర్లతో పోర్టర్ ధర్మామీటర్ మ్యూజియమ్‌ను ఏర్పాటుచేశాడు. అంతేగాదు. రకరకాల ఆకారాల ధర్మామీటర్లున్న మ్యూజియమ్‌గా గిన్నిస్ బుక్ కూడా ఎక్కిందట. కొరియా యుద్ధంలో పనిచేశాక తిరిగి అమెరికా వచ్చి సైన్స్ టీచర్‌గా స్థిరపడ్డాడు పోర్టర్. తన తరగతిలో విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి ధర్మామీటర్లు అవసరమయ్యేవి. అప్పుడే ఈయన వాటితో ప్రేమలో పడ్డాడు. వాటిని సేకరించడం మొదలెట్టాడు. తర్వాత పాడైపోయిన ధర్మామీటర్లను బాగుచేయడం కూడా మొదలెట్టాడు. న్యూజిలాండ్ నుంచి కూడా సేకరించేవాడు. 1990లో బ్రెయిన్ ట్యూమర్‌తో తన కుమార్తె చనిపోయినప్పుడు ధర్మామీటర్లను సేకరించాలని నిర్ణయించుకొన్నాడు. 50 అమెరికన్ రాష్ట్రాలు, 20 దేశాలు, 7 ఖండాలు చుట్టి మరీ ధర్మామీటర్లను పోగుచేశాడు. 1993లో అధికారికంగా ధర్మామీటర్ మ్యూజియం ఏర్పాటు చేశాడు. 83 ఏళ్ల పోర్టర్‌కు తెలుసు తను ఎల్లవేళలా మ్యూజియమ్‌ను చూసుకోలేనని. తన తదనంతరం ధర్మామీటర్ మ్యూజియమ్‌ను పెన్ రాష్ట్రంలో వున్న నేషనల్ వెదర్ మ్యూజియమ్ వారికి అందివ్వాలనుకొంటున్నాడు. ఇప్పటికే చాలా వరకు అక్కడికి చేరిపోయాయి. కానీ అతనికి అత్యంత ప్రియమైన కొన్ని ధర్మామీటర్లు మాత్రం అతని దగ్గరే వున్నాయి. ఇదండీ ధర్మామీటర్ మనిషి ప్రత్యేకత.

వావ్! ఎన్ని డిప్లమాలో!!

అబ్బో...మనం ఒక డిప్లమా చేయడానికే నానా తంటాలు పడుతుంటాం. కానీ ఈ పెద్ద మనిషి వున్నాడు చూశారూ!! నిత్య విద్యార్థి. 53 ఏళ్ల వయసులో కూడా నిద్ర ఆపుకొని మరీ చదువుతుంటాడు. ఆ వివరాల్లోకెళ్దాం. ఈయనగారి పేరు ఝౌ బావోకున్. చైనా వాసి. వయసు ముందే చెప్పేసుకున్నాంకదా. ఇప్పటికీ తన చదువు మాత్రం ఆపలేదు. కొనసాగిస్తూనే వున్నాడు. ఇప్పటికి మొత్తం 9 డిప్లమాలు సంపాదించాడు. అందులో మూడు డాక్టరల్ డిప్లమాలు. రెండు మాస్టర్స్ డిగ్రీలు. ఈయన ఆ డిగ్రీలు, డిప్లమాల కోసం ఇప్పటికి 126, 500 గంటలు వెచ్చించాడు. అయినా అలుపు రాలేదు. విసుగు పుట్టలేదు. మరింత ఉత్సాహంగా నాలుగో డిప్లమాకోసం తెగ చదివేస్తున్నాడు. చైనా వరల్డ్ రికార్డ్స్ వారు ఇతని పట్టుదలను, కృషిని గుర్తించి ఒక అవార్డు కూడా ఇచ్చారండోయ్. అదేంటనుకొన్నారు! స్మార్టెస్ట్ మ్యాన్ ఇన్ చైనా.

సీరియల్

జరిగినకథ:

ట్రాయ్‌ని చూడ్డానికి కుయేన్ ఆసుపత్రికి వెళుతుంది. అక్కడ గార్డ్ ఆమెను చూచి తిడుతూ రాయి విసురుతాడు. ఆమెకు తగలదుకానీ అదంతా చూచిన ట్రాయ్ మనసు కరిగిపోతుంది. అందుకే తనను చూడ్డానికి పదేపదే రావద్దని చెప్తాడు. కుయేన్, ఆమె తల్లి, క్యాన్ అతణ్ణి చూసినందుకు సంతోషిస్తారు. ఆ తర్వాత ట్రాయ్‌ను మళ్లీ జైలుకు తరలిస్తారు. అదంతా ఎక్స్ సోదరి కథలాగా చెప్తుంది. ట్రాయ్ తిరిగి వచ్చినందుకు జైల్లోని వారంతా ఎంతో సంతోషిస్తారు. నడవలేకుండా వున్న అతన్ని పట్టుకొని నడిపించబోయిన ఖైదీలను సిబ్బంది అరచి పంపేస్తారు. అయితే అక్కడ ట్రాయ్‌తో గడిపిన ప్రశాంతమైన క్షణాలను ఎక్స్ సోదరి కుయేన్‌తో చెప్తుంది. జైల్లో నలుగురు ముష్కరులు అతణ్ణి చుట్టుముట్టి ... మనస్సు మార్చేందుకు, వివరాలు రాబట్టేందుకు ప్రశ్నల వర్షం కురిపిస్తారు. అప్పుడు ట్రాయ్ ఇలా సమాధానం చెప్తాడు....

వియత్నాం వీరుడు
ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్

కథనం: ఫాన్-థి-కుయేన్

అనువాదం: పాటూరి రామయ్య

(పదో భాగం)

'**దు**ర్బోధలతో ఎవ్వడూ నన్ను లొంగదీసుకోలేడు. నేను అమెరికన్లను ద్వేషిస్తాను. దక్షిణ వియత్నాం ప్రజల నికృష్ట జీవితాలకు కారకుడు మెక్‌నమారా. అందుకనే అతణ్ణి ద్వేషిస్తాను. అందుకనే అతణ్ణి మట్టుపెట్టాలని ఖచ్చితంగా నిర్ణయించుకొన్నాను'

"గియాథిన్ జైల్లో గియాప్ అనే దుర్మార్గుడు పరమ క్రూరుడని పేరు మోసినవాడు. జైల్లో వుంటూ కాళ్ళు విరగ్గొట్టుకున్నావు..."

ట్రాయ్ ముఖం నిండా కోపం క్రమక్రమంగా పెరుగుతోంది.

మేజా అంచును గట్టిగా పట్టుకొంటూ నెమ్మదిగా గొంతు విప్పాడు ట్రాయ్. ప్రతి మాటనూ విశదంగా ఒత్తిపలుకుతూ ఇలా అన్నాడు :

'మీ అందరికీ ఈ విషయం చెప్పనీయండి. నేను మంచి పనే చేశాను. దురాక్రమణదారులను చంపడం నా ధ్యేయం. ప్రాణాపాయంలో చిక్కుకున్నా, గాయపడ్డా, అంగవైకల్యుణ్ణయినా, చివరికి చంపబడ్డా సంతోషిస్తాను. కాని ప్రాణరక్షణకని గులాంలా బతకలేను. దేశభక్తులకు కీడు తలపెట్టను.'

గియాప్ ముఖం కందగడ్డలా అయింది. ఇలా అన్నాడు :

'ఏమన్నావ్? గులాంలా?'

ట్రాయ్ 'అవున'న్నట్లు తలూపాడు.

మా గుండెలు దడదడా కొట్టుకున్నాయి. ఆ ముష్కరులు క్రూరమృగాల్లాగ ట్రాయ్‌ని చుట్టుముట్టారు. కాని ట్రాయ్‌ని భయపెట్టలేకపోయారు. ముందెన్నడూ లేనంత ఉత్తేజకరమైన ఘటన నన్నెంతో వశపరచుకుంది. నేనూ అతని ధ్యేయం కోసం నిలబడ్డందుకు ఎంతో గర్వించాను. అతనికీ ఇది గర్వకారణం. కుడి, ఎడమల వైపు తిరిగాడు ట్రాయ్. వాళ్ళకేసి తీక్షణంగా చూశాడు. వాళ్ళ పిరికివాగుడుకు కత్తిలా జవాబిచ్చాడు. :

'సరే మా జీవితంలో ఒక్కరోజు కూడా నికృష్టంగా జీవించలేదు. మాకు తినడానికి కావాల్సినంత ఉంది. మా భార్యాపిల్లలు హాయిగా సంతోషంగా ఉన్నారు. నువ్విలాగే వాగుతున్నట్లయితే నీ గురించి 'నా' అనే వాళ్ళెవళ్ళూ లేరు. మా నుంచి దయ, కనికరం ఎలా ఆశిస్తావ్?'

ట్రాయ్ చీదరించుకున్నాడు. తల ఒక వూపు వూపి ఇలా అన్నాడు :

'మీ మాదిరి నేను జీవించను. ఇది నిజం. మీవలె జీవించడం కన్నా చావడం మేలు'.

టాంహ్యా అనే ముష్కరుడు ఉత్త ఎర్రముఖంవాడు. వాడు నవ్వాడు. ట్రాయ్ విరిగిన కాలు చూపుతూ ఇలా అన్నాడు :

'నీ మూర్ఖత్వం నిన్ను మరణ ద్వారాల వైపు నెడుతున్నది. వియత్కాంగ్ ప్రేరణవల్ల కదూ నీ కాలు విరిగింది!'

ట్రాయ్ నిశ్శబ్దంగా ఉండిపోయాడు. చేయిపట్టుమీద పైకి లేచి నిలబడ్డాడు. నాలుగడుగులు ముందుకు వేశాడు. వెనక్కు తిరిగి ఈ ముష్కరుల వైపు చూడకుండానే బిగ్గరగా అన్నాడు.

'మిమ్మల్ని చూస్తోంటే నిజంగా అసహ్యం వేస్తుంది. ఇంతకన్నా ఒక్కమాట కూడా మీకు చెప్పను'

వెనుక వైపునున్న గోడకెదురుగా కూర్చొనివున్న ట్రాయ్ కింద పడబోతున్నట్లున్నాడు. లోయ్ ఒక్క వూపున వచ్చి ట్రాయ్ పక్కన నిల్చున్నాడు పట్టుకుంటానికి. అప్పుడు చూశాను ట్రాయ్ శక్తిని, కిందపడిపోకుండా తట్టుకొని గట్టిగా నిలబడ్డాడు ఆకాశంలోకి తీవ్రంగా చూస్తూ.

వెంటనే వ్యాన్ వచ్చింది. ట్రాయ్‌ని వ్యాన్‌లోకి తోశారు. వ్యాన్ వెళ్ళేవరకు అక్కడే నిలబడి వున్నాం. వ్యాన్ కదిలిపోతున్నప్పుడు ట్రాయ్‌ని పిలుస్తూ మేము చేతులు వూపాం. వ్యాన్ తలుపుకు ఆనుకొని మా వైపు మరీ మరీ చూశాడు ట్రాయ్.

ఆ రోజు నేనూ, నా సహచారిణులు తోటి ఖైదీలను కలుసుకొన్నప్పుడు ట్రాయ్‌తో గడిపిన మరపురాని ఆ పదినిముషాల సన్నివేశం గురించి చెప్పమని అడిగారు. అప్పుడే మాలో నుంచి ఒకరిని చిత్రహింసా గృహానికి పిలిచారు. మేము

ఒకరినొకరం యాదృచ్ఛికంగా ఇలా చెప్పుకున్నాం 'మనం ట్రాయ్‌వలె నిర్భయంగా, సాహసోపేతంగా, ఉండాలి. ట్రాయ్‌లా జీవిద్దాం.'

◆◆◆

రోజూ సైగాన్ వీధుల్లో అనేక పరిణామాలు సంభవిస్తూ వచ్చాయి. రాత్రిళ్ళు కూడా ప్రదర్శనలు జరిగాయి. పెయింటర్లూ, ఓడరేవు కార్మికులు, చిన్నకారు డ్రైవర్లూ, రిక్షా కార్మికులు, విద్యార్థులు, విద్యుత్ కార్మికులు, చక్కెరమిల్లు కార్మికులు వగైరా అంతా మా తల్లిదండ్రులు నివసిస్తోన్న ప్రాంతంలో చేరారు. వాళ్ళు పనులు మానేశారు. ఖాన్ ప్రధాన కార్యాలయం దగ్గరకు జెండాలతో పెద్ద ప్రదర్శన చేశారు. జనరల్ యన్ గుయెన్ ఖాన్ (కీలుబొమ్మ ప్రభుత్వం అధిపతి) రాజీనామా చేయాలని డిమాండుచేశారు. యన్‌గుయెన్ ఖాన్ అంటే ఎవడో కాదు. నా భర్తకు మరణశిక్ష విధించబడిన పత్రంపై సంతకం చేసినవాడే. పట్టణంలోని ప్రజలందరూ అతణ్ణి ఖండించారు. నేను జైల్లో వున్నప్పుడు నా సహఖైదీలు ఇలా చెప్పారు.

"ఇరవై లక్షల సైగాన్ ప్రజలు ఒక్కటై మాతో భుజం భుజం కలిపి పోరాడ్డానికి సంసిద్ధమైన రోజున శత్రువు నాశనంకాక తప్పదు" నా ఆలోచన ఆగిపోయింది. ఇది నిజంగా జరిగేటట్లయితే నా భర్తను రక్షించుకునేందుకు జైలు గోడలు ధ్వంసం చేసే కార్యక్రమంలో పాల్గొంటానికి జైలు దగ్గరకెళ్ళేదాన్ని. ఆయన్నిప్పుడు ఏ జైల్లో నిర్బంధించారో?

ఆగస్టు 11వ తేదీన ట్రాయ్‌కు మరణశిక్ష విధించారు. ఆ రోజు నుంచి ఆయన్ను గురించి తెలుసుకోవడానికి విఫలయత్నం చేశారు.

'నేను బాధపడ్డాను. ఆయన ఛిహోవా జైల్లో వున్నాడా! నన్ను చూడనీయకుండా ఆయన్ను చంపివేయడానికి ఒక జైలు నుంచి మరో జైలుకు బదలాయిస్తున్నారు. తెలుసుకుందామని శిక్షితుల వార్డుకు వెళ్ళాను. అక్కడున్న కాపలావాళ్ళ నుంచి సమాధానం కోసం ఎదురుచూశాను. నన్ను పిలుస్తున్నట్లు వినబడింది.

నా భర్త గొంతును గుర్తుపట్టాను. ఆఫీసులోకి వెళ్ళేందుకు ప్రయత్నించాను. ఆ వైపునే ఒక వ్యాన్ వెళ్ళింది. వ్యాన్‌కు చుట్టూ ఇనుప వలలు బిగించారు. ఆ సందుల్లోంచి ట్రాయ్ ముఖం చూశాను. నన్ను పిలుస్తూ చేతులు ఊపుతున్నాడు. అప్పుడు నాకేమీ దిక్కు తోచలేదు. వ్యాన్ కదిలిపోబోతూ వుంది. వెంటనే వ్యాన్ దగ్గరకు పరుగెత్తాను.

'నా భర్తను చంపడానికి దూరంగా తీసుకెళుతున్నారా? అయనే నాకు దిక్కు'

మెయిన్ గేటు వైపుకు తిరిగింది వ్యాన్. కనపడకుండా పరుగెత్తింది. రోడ్డు పక్కన దుమ్ములో దిక్కులు చూస్తూ నిలబడ్డాడు.

ఎవరైనా వచ్చి సహాయం చేస్తారన్న ఆశతో ఎదురు చూశాను. ట్రాయ్‌ని పిలుస్తూ కేకలేస్తూ అక్కడే ఉండిపోయాను. ఒక కాపలావాడు చిన్న కిటికీలోంచి నన్ను ఉద్దేశించి ఇలా అన్నాడు :

'ఎందుకలా కుమిలిపోతావు? నీ భర్తను ఫోటో తీయించడానికి తీసుకెళ్ళారు. మళ్ళీ తిరిగి వస్తాడు. వచ్చేదారి కూడా ఇదే. మధ్యాహ్నం మూడు గంటలకు రా. చూడ్డానికి అనుమతిస్తారు.'

పెనవేసుకున్న సందేహాలతో ఇలా అడిగాను :

'నువ్వు చెబుతోంది నిజమేనా?'

'నిజమే కావచ్చు. ఇవిగో ఈ కాగితాలు చూడు'

నమ్మకం కుదిరింది.

మధ్యాహ్నం మూడు గంటలకు మళ్ళీ వచ్చాను. మరణశిక్ష విధించబడిన ఖైదీలను చూడ్డానికి వచ్చే వాళ్ళకు ఒక ప్రత్యేక గదిని కేటాయించారు.

ట్రాయ్ నాకోసం ఎదురు చూస్తున్నాడు. కిందికి దిగి వచ్చేందుకు తోటి ఖైదీ ఒకతను ఆయనకు సహాయపడ్డాడు. వాళ్ళకు కొన్ని గజాల దూరంలో ఒక చిన్న మేజా దగ్గర కూర్చొని వున్నాడు పోలీసువాడు. నేను వస్తుండగా వాడు చూశాడు.

'మన పెళ్ళికి ముందురోజుల్లో గట్టి యంత్రాంగాన్ని నిర్మించుకునే ప్రయత్నాల్లో లీనమైపోయాను. అందువల్ల ఇంటికి కూడా వచ్చే వీలులేకుండా పోయింది. ఒకొక్కపుడు రాత్రిళ్ళు కూడా రహస్య కార్యకలాపాలు అతి రహస్యంగా ఉంచాలనే నిబంధన వుంది. ఇది చాలా ఖచ్చితమైన విషయం. అందుకనే ఎన్నోసార్లు నీకు నిజం చెప్పకుండా అబద్ధాలు చెప్పాను.

ట్రాయ్ మిత్రుడు లేచి వెంటనే తలుపు దగ్గరకు వచ్చాడు. ట్రాయ్ నన్ను చూశాడు. బెంచిమీద భుజం ఆదరవు చేసుకొని కూర్చొని వున్నాడు. తెల్లటి చొక్కా, చాలీచాలని లాగు ధరించి వున్నాడు. భోజనం తీసుకెళ్ళిన బుట్ట కిందపడిపోకుండా గట్టిగా పట్టుకొని వున్నాను. జైల్లో నా సహ ఖైదీలు యిచ్చిన సలహా జ్ఞాపకం వచ్చింది.

'నిశ్చలంగా వుండాలి. ఎలాంటి విచారానికి, మనోవేదనకు లొంగిపోకూడదు. నీవు కార్చే ప్రతి కన్నీటిబొట్టు నీ బాధల్నింకా అధికం చేస్తుంది

ఆయన జీవించడానికి మిగిలి వున్న ఈ చివరి రోజుల్లో నాకోసం ఆయన ఎలాంటి బాధపడకూడదని కోరుకున్నాను. అయినప్పటికీ అశ్రువులు నా చెక్కిళ్ళపైబడి కిందకు జారిపోతున్నాయి. ఆయన్ను పిలవాలనుకున్నాను. ఆయన దగ్గరకెళ్ళాను. నన్ను ఆహ్వానిస్తూ చేతులు చాచాడు ట్రాయ్. నా చేతులు పట్టుకొని లాగి బెంచి మీద ఆయన పక్కనే కూర్చోబెట్టుకున్నాడు. ఆయన భుజాల మీద నా తలను ఆనించాను.

ఏమిటో చెప్పాలనుకున్నాను. కానీ ఆయన్ను పేరెత్తి కూడా పిలవలేక పోయాను. ఆయన మీద వాలిపోయాను. నా కళ్ళ నిండా నీళ్ళు నిండాయి. ఆయన వైపు చూస్తూ ఏడ్చాను. నా తల వెంట్రుకలను నెమ్మదిగా తడుముతూ ఇలా అన్నాడు.

'వార్తా పత్రికలు చదివి నిజంగా ఏడ్చావు కదూ?'

'ఏడ్వకుండా ఎలా వుండగలను? స్నేహితుడు, బంధువులు ఈ వార్తను పట్టుకొచ్చారు. ఏడ్చారు. నిన్ను ఏ జైల్లో నిర్బంధించారో తెలుసుకోవడానికి వారాలు తరబడి ప్రయత్నించాను. కాని ఫలించలేదు. మరణశిక్ష ఉపసంహరించే విధంగా మనవి చేయమని నాన్నగారు ఒక వకీలును కోరాడు.

ట్రాయ్ విస్తుపోయి ఇలా అన్నాడు

'వకీలును తీసుకురావద్దు. వృధా ప్రయాస. డబ్బు దండగ.' కారుతోన్న నా కన్నీళ్ళు తుడుస్తూ ఇలా అడిగాడు!

'నీ కష్టాలకు నేను కారణమయ్యాను. నా మీద కోప్పడుతున్నావు కదూ?'

'నిన్ను మాత్రమే ప్రేమిస్తున్నాను. నీ మీద నాకు కోపం ఎలా వస్తుంది? మీ యెడల నేను మహాపరాధం చేశాను. నేను జైల్లో వున్నప్పుడు నా సహచారిణులు నన్నెంతో అభివృద్ధి పరచారు. చైతన్యం కలిగించారు. చాలా పశ్చాత్తాప పడ్డాను. జరిగిందానికి ఏడ్చాను. దయచేసి నన్ను అర్థం చేసుకోండి.

నీవు విప్లవ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నప్పుడు నేను తెలుసుకోలేకపోయాను. అందువల్ల అనుమానాలు ఆవరించాయి. నీ మీద చిరాకుపడ్డాను. ఇవన్నీ తలచుకొని నాలో నేను కుమిలిపోతున్నాను."

ఆయనిలా అన్నాడు...

'మన పెళ్ళికి ముందురోజుల్లో గట్టి యంత్రాంగాన్ని నిర్మించుకునే ప్రయత్నాల్లో లీనమైపోయాను. అందువల్ల ఇంటికి కూడా వచ్చే వీలులేకుండా పోయింది. ఒకొక్కపుడు రాత్రిళ్ళు కూడా రహస్య కార్యకలాపాలు అతి రహస్యంగా ఉంచాలనే నిబంధన వుంది. ఇది చాలా ఖచ్చితమైన విషయం. అందుకనే ఎన్నోసార్లు నీకు నిజం చెప్పకుండా అబద్ధాలు చెప్పాను. అందువల్ల నా మీద నీకు అవిశ్వాసం కలిగింది. నాకు తెలుసు. ఒక్కో పర్యాయం ఇందుకు చాలా బాధపడేవాణ్ణి. మన వివాహమైన తర్వాత చుట్టపక్కాలను చూపించటానికి నిన్ను తీసుకెళతానని మాట యిచ్చాను. కాని పని వత్తిడివల్ల అలా చేయలేకపోయాను. అప్పుడప్పుడు నీవు వేసే ప్రశ్నలకు నమ్మశక్యంగాని, విచిత్రమైన జవాబులు చెప్పేవాణ్ణి. ఆ రోజులు మన వివాహానికి తొందర పెట్టాయి. ప్రతి సాయంత్రం నేను బైటకెళ్ళి చాలా పొద్దుపోయిన తర్వాత వచ్చేవాణ్ణి. నేనప్పుడు సమావేశాలకు హాజరయేవాణ్ణి. ఆ సందర్భాల్లోనే శత్రువు రాక, పోక, ఎలా దెబ్బతీయాలి అని అధ్యయనం చేస్తుండేవాణ్ణి.

(మిగతాభాగం వచ్చేవారం)

అమర గాయకునికి అవధాన నీరాజనం



డా॥రహ్మతుల్లా వినూత్న ప్రక్రియ

తెలుగు సాహిత్యంతో, సాహిత్య ప్రక్రియలతో పరిచయం ఉన్నవారికి 'అవధానం' గురించి తెలిసేవుంటుంది. ఇప్పటితరం ఇంగ్లీషు మీడియం చదువుల విద్యార్థులకు అవధానం గురించి తెలియకపోవచ్చుగాని తెలుగు సాహిత్యం ప్రధానాంశంగా చదువుకున్నవారికి బాగా తెలుసు. ఇది తెలుగువారికే ప్రత్యేకమైన ఒక సాహిత్య ప్రక్రియ, కళ కూడా. ఇది ధారణపై అంటే జ్ఞాపకశక్తిపై ఆధారపడిన ఓ అద్భుత ప్రక్రియ. ఇది సాధారణంగా పద్యాలకు సంబంధించి ఉంటుంది. దీనిలో అష్టావధానం, శతావధానం, సహస్రావధానం మొదలైనవి చేస్తుంటారు. అవధానం అంటే స్థూలంగా చెప్పుకోవాలంటే పృచ్ఛకులు ప్రశ్నలు సంధిస్తారు. వాటికి అవధాని జవాబులు చెబుతాడు. అడిగిన ప్రశ్నలకు ఛందోబద్ధంగా అప్పటికప్పుడు పద్యాలు చెప్పడంలోనే అవధాని ప్రతిభ తెలుస్తుంది. ఒకానొక కాలంలో ఆంధ్ర దేశాన్ని అవధాన ప్రక్రియ ఒక ఊపు ఊపింది. ఉద్దండులైన అవధానులు ఉండేవారు. అవధానుల ధారణాశక్తి, కల్పనా చాతుర్యం చూస్తే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. సాహిత్యానికి సంబంధించిన ఈ అవధానం ఇంకా నేత్రావధానం, శబ్దావధానం, సంగీతావధానం, గణితావధానం మొదలైన వాటిగా విస్తరించింది. సరే.... ప్రస్తుతం ఇంతకు మించి ఆశ్చర్యకరమైన అవధానాన్ని ఒక డాక్టర్ ప్రాచుర్యంలోకి తెచ్చారు. దీనికి సాహిత్యంతో సంబంధం ఉన్నా అది పద్య సాహిత్యం కాదు. ఒక సంగీత విద్వాంసుని జీవిత చరిత్ర, ఆయన పాటలకు సంబంధించిన అవధానం ఇది. ఆ సంగీత విద్వాంసుడు అమర గాయకుడు ఘంటసాల. ఆయనకు సంబంధించి అవధానం చేస్తున్న వ్యక్తి డాక్టర్ రహ్మతుల్లా.

రహ్మతుల్లా వృత్తి రీత్యా వైద్యులు. కాని...ఆయన ప్రవృత్తి అవధానం. అదీ కేవలం ఘంటసాలకు సంబంధించి మాత్రమే. ఘంటసాల పాడిన వేలాది సినిమా పాటలను, ఆ సాహిత్యాన్ని, ఆయన జీవిత విశేషాలను గుర్తు పెట్టుకొని, పృచ్ఛకులు అందుకు సంబంధించి అడిగే ప్రతి ప్రశ్నకు ఠక్కుమని సమాధానం చెప్పడం సామాన్యమైన విషయం కాదు. ఈ ఆధునిక అవధానం రాష్ట్రవ్యాప్తంగా, ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగువారిని, ముఖ్యంగా ఘంటసాల అభిమానులను, సినిమా పాటలంటే చెవి కోసుకునేవారిని అలరిస్తోంది. డాక్టర్ రహ్మతుల్లా సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి కాదు. సినిమా పరిశ్రమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఒడిషా రాష్ట్రంలోని పర్లాకిమిడికి చెందిన వ్యక్తి. (ప్రస్తుతం వృత్తి రీత్యా హైదరాబాదులో స్థిరపడ్డారు). సికింద్రాబాదులోని అపోలో ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తున్నారు. కేవలం ఘంటసాల గానామృతానికి మైమరిచిపోయి, ఆయన పాటలపై మమకారం పెంచుకొని, ఘంటసాల పాటలను ఔపోసన పట్టారు. చివరకు అదే ఘంటసాలపై అవధానం చేయడానికి నాంది పలికింది. డాక్టర్ రహ్మతుల్లా ఘంటసాల పాటలపై లోతైన పరిశోధన చేశారు. ఘంటసాల పాటలపై పట్టు సాధించిన రహ్మతుల్లాను ఆయన స్నేహితులు 'మీరు ఘంటసాలపై ఇంత పట్టు సాధించారు కదా. దీన్ని ఒక అవధాన ప్రక్రియగా ఎందుకు చేయకూడదు?' అంటూ సరికొత్త ఆలోచన రేకెత్తించారు. దీంతో ఈ డాక్టర్ అవధాన రంగంలోకి దిగారు. ఘంటసాల పాటలు, సాహిత్యం, ఆయన జీవిత విశేషాలకు సంబంధించిన ఎంతటి క్లిష్టమైన ప్రశ్నలకైనా క్షణాల్లో సమాధానాలు ఇస్తూ తన ప్రతిభను రుజువు చేసుకుంటున్నారు. ఘంటసాలపై అవధానం ఒక వినూత్నమైన ప్రక్రియగా అభిమానులను అలరిస్తోంది. ఇప్పటికే వందల కొద్ది ప్రదర్శనలు ఇచ్చారు డాక్టర్ రహ్మతుల్లా. ఘంటసాల పది వేలకు పైగా పాటలు పాడారు. ఆ పాటలన్నింటినీ పుక్కిట పట్టారు రహ్మతుల్లా. ఒక పాట గురించి ప్రశ్నిస్తే ఆ పాట ఏ సినిమాలోనిది, దాని రచయిత ఎవరు, సంగీతం ఎవరు, బ్యానర్ ఏమిటి, దర్శకుడు ఎవరు, ఏ సంవత్సరంలో విడుదలైంది....మొదలైన వివరాలన్నీ చెబుతారు. దీన్ని బట్టి రహ్మతుల్లా పరిశోధన ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. పృచ్ఛకుల్లో విభిన్న ధోరణులవారుంటారు. ఒకరు ఘంటసాల పాటలకు రాగాలు అడుగుతారు. కొందరు కవి పేరు అడగుతారు. కొందరు ఘంటసాల ప్రయివేటు గీతాల గురించి అడుగుతారు. ఇంకొందరు ఆయన ఫలాన పాట ఏ నటుడికి పాడారని అడుగుతారు. ఆయన ఎన్ని యుగళగీతాలు పాడారని అడుగుతారు. ఆయన పాడిన మొదటి పాట ఏది, చివరి పాట ఏది అని అడుగుతారు. కొందరు పల్లవి అడిగి ఇది ఏ సినిమాలోది అంటారు. కొందరు మధ్యలో చరణం పాడి దీని పల్లవి ఏమిటని అడుగుతారు. ఇలా....అడిగిన ప్రశ్నలన్నీ గుర్తు పెట్టుకొని వెంట వెంటనే సమాధానాలు ఇస్తారు రహ్మతుల్లా. నిజానికి ఆయన గురించి చదవడం కన్నా ఆ అవధాన ప్రక్రియ చూస్తే మరింత ఎంజాయ్ చేయవచ్చు. తాను ఘంటసాలపై అవధానం చేస్తున్నది ఆ మహనుభావుడిని మరింత సజీవంగా ఉంచడానికేనని, తద్వారా ఘంటసాల పాటలపై ఈనాటి యువతకు మరింత అవగాహన కల్పించడానికే కృషి చేస్తున్నానని చెబుతున్నారు రహ్మతుల్లా.

1952లో జన్మించిన రహ్మతుల్లా ఒడిషా వాస్తవ్యుడైనప్పటికీ, మైనారిటీ సామాజిక వర్గానికి చెందినవాడైనప్పటికీ తెలుగు సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. బరంపురంలో మండపాక పద్మావతి వద్ద కర్ణాటక గాత్ర సంగీతం అభ్యసించారు. ఘంటసాల సినిమా పాటల పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు గెలుచుకున్నారు. అనేక పాటల పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈలపాట పాడతారు. హార్మోనియం, గిటార్, వయోలిన్ వాయిస్తారు. లలిత గీతాలు, కథలు రాస్తారు. అనేక లలిత గీతాలకు స్వరకల్పన చేశారు. అనేక పట్టణాలు, నగరాలతో పాటు ఘంటసాల జన్మస్థలమైన చౌటపల్లిలో కూడా అవధానం నిర్వహించారు. తెలుగుతో పాటు తమిళం, మళయాళం, ఒరియాలోనూ మంచి ప్రవేశం ఉంది. గత పాతికేళ్లుగా తన సొంత ఊరైన పర్లాకిమిడిలో ఘంటసాల పాటల పోటీలు నిర్వహిస్తున్నారు. నటన, దర్శకత్వం ఈయన హాబీలు. ఘంటసాల వీరాభిమాని అయిన రహ్మతుల్లా ఒడిషాలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. దీన్ని ఎస్పి బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు.

-ఎం.నాగేందర్

లైట్ తీస్కో

చీమాయణం

చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరతాయంటూ పరాన్న జీవులను ఏకేశారు. శివుడి ఆజ్ఞ లేకుండా చీమైనా కుట్టదంటారు ఆధ్యాత్మిక వాదులు. మన బామ్మలు, తాతాయ్యల కథ 'అనగనగా రాజు'లో చీమ నా బంగారు పుట్టలో వేలుపెడితే కుట్టనా?!' అంటూ తనని ఎవరన్నా ఏమన్నా అంటే ఊరుకోనంటుంది. చీమల్లో కొన్ని వేల రకాలున్నాయట. చీమ భాషపై పరిశోధనలు జరుగుతున్నాయి. చీమకు ఎన్నికాళ్లనే దానిపై మేధావులు ఇప్పటికీ మథనం చేస్తున్నారు. అతితక్కువ వస్తుపరిమాణాన్ని 'చీమతలకాయంత'గా చెపుతారు. 'పాపం చేస్తే చీమై పుడతారంటారు. జర్నలిస్టులు చీమలా వార్తలను పసిగట్టాలంటారు. నిశ్శబ్దం గురించి చెప్పేటప్పుడు 'చీమ చిటుక్కుమనడం' తెలిసిందే. ఏనుగును సైతం చీమ ముప్పతిప్పలు పెట్టిందట.



చీమ....

ఆకారంలో చిన్నదని మనకు చులకన. కాని చీమకూ చాంతాడంత చరిత్ర ఉందండోయ్. లాంగ్ లాంగ్ ఎగో చీమ శంకరుడి కటాక్షం కోసం తపస్సు చేసింది. 'భక్తా ఏమి నీ కోరిక?' అని శంకరుడు చీమ ముందు ప్రత్యక్షమయ్యాడు. తాను కుట్టగానే చనిపోవాలని వరం కోరుకుంది చీమ. తథాస్తు అన్నాడు శంకరుడు. ఆ నాటి నుండి చీమ కుట్టడం మనిషి దాన్ని నలిపి చంపడం జరుగుతున్న చరిత్ర. ఇదో పుక్కిటి పురాణం. కాని దీనిలోనూ నీతి ఉంది. తన చేత కుట్టించుకున్నవారెవరైనా చావాలని చీమ వరం కోరుకోవాలనుకుంది. భాష, భావ వ్యక్తీకరణలో పొరపాటు చేసి తన నెత్తిమీదికే తెచ్చుకుంది. ఏదైనా విషయాన్ని ఎదుటివారికి సూటిగా అర్థమయ్యేటట్లు వ్యక్తీకరించకపోతే ఎదురయ్యే అనర్థాలను చీమ 'పురాణం' బోధిస్తోంది.

అంతే కాదండోయ్, చిన్న చీమ మనుషులకు బోల్డంత వ్యక్తిత్వవికాసాన్ని బోధిస్తుంది. ఆహార సేకరణకు సాటి చీమలందరినీ పోగేసి సమిష్టితత్వాన్ని లోకానికి అందించింది. 'క్యూ' అని బోర్డు ఉన్నా క్యూ పాటించని మనుషులకు చీమల 'క్యూ'లు 'క్యూ' క్రమశిక్షణ నేర్పుతున్నాయి. ఆర్నెల్లపాటు ఆహారాన్ని దాచుకొని ముందస్తు ప్రణాళికలు అందించాయి. దుబారా ఖర్చులు చేసే వారికి పొదుపు నేర్పుతున్నాయి. శత్రువుకు సైతం హాని చేయని మనస్తత్వం చీమది. తాము పుట్టలు పెట్టి పాములకు ఆశ్రయం ఇస్తున్నాయి. పూర్వ కవులకు కథా వస్తువు చీమ. 'బలవంతమైన సర్పము చలి చీమల చేత చిక్కి చావదే' అని సుమతీ శతకంలో బలవంతుల విర్రవీగుడును ఎండగట్టారు. చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరతాయంటూ పరాన్న జీవులను ఏకేశారు. శివుడి ఆజ్ఞ లేకుండా చీమైనా కుట్టదంటారు ఆధ్యాత్మిక వాదులు. మన బామ్మలు, తాతాయ్యల కథ 'అనగనగా రాజు'లో చీమ నా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టనా?!' అంటూ తనని ఎవరన్నా ఏమన్నా అంటే ఊరుకోనంటుంది. చీమల్లో కొన్ని వేల రకాలున్నాయట. చీమ భాషపై పరిశోధనలు జరుగుతున్నాయి. చీమకు ఎన్నికాళ్లనే దానిపై మేధావులు ఇప్పటికీ మథనం చేస్తున్నారు. అతితక్కువ వస్తుపరిమాణాన్ని 'చీమతలకాయంత'గా చెపుతారు. 'పాపం చేస్తే చీమై పుడతారంటారు. జర్నలిస్టులు చీమలా వార్తలను పసిగట్టాలంటారు. నిశ్శబ్దం గురించి చెప్పేటప్పుడు 'చీమ చిటుక్కుమనడం' తెలిసిందే. ఏనుగును సైతం చీమ ముప్పుతిప్పలు పెట్టిందట.

చలిచీమలు, చీమలదండు సినిమాలు తెరకెక్కాయి. 'చలిచీమలు' పుస్తకమే వచ్చింది. చలిచీమల పేరుమీద ఒక పత్రిక ప్రత్యేక కాలమ్‌ను నడిపింది. సినిమా పాటల్లో చీమ పాటలెన్నో. 'చీమ కుట్టిందా చిమచిమలాడిందా' అని ఎన్టీఆర్ పాడితే 'ఓరి నాయనో చిలిపి చీమ కుట్టిందయ్యో' అని చిరంజీవి స్టెప్పులేశారు. 'చీమ చీమ చిమ చీమా చీమా' అని జూనియర్ ఎన్టీఆర్ గిలిగింతలు పెట్టారు. సికాకులంలో చీమాలున్నయంట' అని వంగపండు శ్రీకాకుళం నక్సల్ ఉద్యమానికి ఊతం పలికారు. ఈ మధ్య మధుమేహం వ్యాధికి పేటెంట్ తీసుకోకుండానే లోగో అయింది చీమ. చీమలను తింటే కంటికి మంచిదనేవారు పూర్వీకులు. అదేదో దేశంలో కేవలం చీమలనే ఆహారంగా తీసుకొని ఒకాయన గిన్నీస్ బుక్‌లో ఎక్కారు. పాలకులు ప్రజల సమస్యలను పట్టించుకోనప్పుడు 'చీమ కుట్టినట్టయినా లేద'ంటారు. అధికారంలో ఉన్నవారి చుట్టూ చేరే వారిని 'బెల్లం వద్దకు చీమల'నడం కద్దు. 'చీమ'కుర్తి గెలాక్సీ రాయి ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. 'చీమ'కుర్తి గనుల్లో రాజకీయ రాబందుల అక్రమాలపై ఎన్నోసార్లు అసెంబ్లీ స్తంభించింది. 'చీమ'కుర్తి గని ప్రమాదం కార్మికులను పొట్టన పెట్టుకుంది. చురుకుదనానికి చీమ కుట్టుడుతో పోల్చినా చీమ కుడితే కలిగే మంట కుట్టించుకున్న వారికే తెలుస్తుంది. చెవిలో చీమ దూరితే ఆ బాధ వర్ణనాతీతం. మామిడిపండుకూ చీమకు అవినాభావ సంబంధం ఉంది. చీమలను చంపడానికి గమాక్సిన్ నుంచి 'లక్ష్మణరేఖ' సహా పలు బ్రాండ్ల చీమలమందులొచ్చి బహుళజాతి కంపెనీలకు సిరులు కురిపిస్తున్నాయి. చీమలమందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న అన్నదాతలు, మైక్రో ఫైనాన్స్ బాధితులూ ఉన్నారు. మా మైలవరం దగ్గర చీమలపాడు ఊరుంది. చీమబడిలో బోల్డంత పర్సనాల్టీ డెవలప్‌మెంట్. సైకియాట్రిస్టులను సంప్రదించే బదులు 'చీమబడి' లో చేరితే పోలా? చీమా వర్ధిల్లు!

-కె.ఎస్.వి. ప్రసాద్

అడ్డగోలు రేట్లతో అధికారిక దోపిడీ!

- రెంటాల జూనియర్

ఈ మధ్య 'ఆరెంజ్' చిత్ర పాటల విడుదల కార్యక్రమంలో మాట్లాడుతూ, హీరో చిరంజీవి చాలా ఆవేశంగా పైరసీదారులపై విరుచుకుపడ్డారు. ఎంతో కష్టపడి, కోట్ల రూపాయలు వెచ్చించి, చిత్ర నిర్మాతలు సినిమా తీస్తుంటే, వాళ్ళ మొత్తం కష్టాన్ని పది రూపాయల సీడీలతో పైరసీదారులు తేలిగ్గా కొట్టేసి, దొంగ సొమ్ము సంపాదించేస్తున్నారంటూ దుయ్యబట్టారు. నిజమే! చిత్రసీమకు పట్టిన దౌర్భాగ్యం - దారుణమైన పైరసీ! దీన్ని అందరూ ఖండించాల్సిందే! పైరసీని నిరోధించాల్సిందే! ఒక్క క్షణం ఆ సంగతి అటుంచి, ఇప్పుడు నాణానికి రెండో కోణం చూద్దాం. ఇంత పైరసీ అసలు ఎలా పెరుగుతోంది? దీనికి హీరోలు, దర్శక - నిర్మాతల బాధ్యత ఏమిటి? ప్రేక్షకులు హాలుకు వెళ్ళడం మానేసి, పైరసీ సీడీలను ఎందుకు ఆశ్రయిస్తున్నారు? ఈ విషయాలన్నీ లోతుగా ఆలోచిస్తే, పైరసీకి కారణమై, ఊరూరా పాకుతూ, తెలుగు సినిమాను తినేస్తున్న క్యాన్సర్ కనిపిస్తుంది. అది ఏమిటంటే - సామాన్యుడికి అందుబాటులో లేని సినిమా టికెట్ రేట్లు!

రాష్ట్రంలోని పెద్ద నగరాలను కాస్త పక్కనపెడదాం. మిగిలిన ఏ ఊళ్ళోనైనా అగ్ర హీరోల సినిమాకు విడుదలైన తొలి రోజుల్లో వెళ్ళి చూద్దాం. సినిమా హాళ్ళలో పబ్లిక్‌గా ప్రేక్షక జనానికి జరుగుతున్న నిలువు దోపిడీ కళ్ళెదురుగా కనబడుతుంది. సినిమాకున్న క్రేజును బట్టి హాలు కౌంటర్‌లోనే అధికారికంగా టికెట్లను ఎక్కువ రేట్లకు అమ్మేస్తున్నారు. ఇందులో ప్రభుత్వ అధికారుల నిఘా ఎంతో కొంత ఉండే 'ఏ ప్లస్' కేంద్రాల్లో తప్ప, మిగిలిన అన్ని కేంద్రాల్లో ఈ అడ్డగోలు టికెట్ రేట్ల విధానం ఇష్టారాజ్యంగా సాగుతోంది.

దీని పుణ్యమా అని ప్రతి అగ్ర హీరో తెలుగు సినిమా తొలి వారంలోనే కోట్లకొద్దీ ఆర్జిస్తోంది. చిత్రం ఏమిటంటే - బాగా లేదని 'టాక్' వచ్చిన సినిమాకు కూడా, తొలినాళ్ళ కలెక్షన్లు కళ్ళు తిరిగేలా ఉంటున్నాయి. దీనికి కారణం - ఇలా అడ్డగోలు రేట్లకు టికెట్లను అమ్మే విధానమే. నిజానికి, ప్రభుత్వపరంగా ఈ విధానానికి అనుమతి లేదు. కాగా, ఇటీవల కొద్ది నెలల క్రితం మన సినిమా పెద్దలు ప్రభుత్వాన్ని ఆశ్రయించి, కొంతమేర టికెట్ రేట్లు పెంచుకొనే అనుమతి తెచ్చుకున్నారు. దీంతో ఇప్పుడు పెద్ద ఊళ్ళలో బాల్కనీ టికెట్ రేటు రూ. 40 నుంచి రూ. 50 అయింది. ఇక, మల్టీప్లెక్సుల్లో టికెట్ రూ. 100 నుంచి రూ. 150 అయింది.

బ్లాక్ మార్కెట్ సిత్రాలు

అయితే, ప్రభుత్వ అనుమతితో సంబంధం లేకుండా, ఎక్కడికక్కడ లోపాయకారీగా జరుగుతున్న అడ్డగోలు టికెట్ల విధానం ఇప్పుడు ప్రబలమైన జాఢ్యంగా విస్తరిస్తోంది. తెలుగునాట సినిమా హాళ్ళలో ప్రస్తుతం టికెట్లను రెండు రకాలుగా అక్షరాలా అధికారికంగా బ్లాకులో అమ్మేస్తున్నారు. అందులో మొదటిది - 'ఫ్లాట్ రేట్ల విధానం'. అంటే - బాల్కనీ నుంచి నేల వరకు హాలులోని అన్ని తరగతుల టికెట్లనూ 'ఫ్లాట్' రేటున బాల్కనీ టికెట్ ధరకే కౌంటర్‌లోనే అమ్మేస్తారు. ఈ పద్ధతిలో 'ముందు వచ్చినవారిని మున్ముందు' పద్ధతిలో, పైనుంచి కిందికి తరగతుల సీట్లను క్రమంగా నింపుతారు. ముందుగా హాల్లోకి వెళితే బాల్కనీలో కూర్చుంటే, పై తరగతులు నిండిపోయాక వెళితే బాల్కనీ రేటిచ్చి కొన్న టికెట్‌తో నేల తరగతిలో కూర్చొని సినిమా చూడాల్సి వస్తుంది. ఇది చాలా ఏళ్ళుగా చిన్న కేంద్రాల్లో సాగుతున్న వ్యవహారం.

ఇక, రెండోది - 'జంపింగ్ రేట్ల విధానం'. అంటే - సినిమాకున్న క్రేజును బట్టి, బాల్కనీ అసలు రేటుకు అయిదారు రెట్ల ధరకు టికెట్లన్నీ అధికారికంగా కౌంటర్‌లోనే అమ్మేస్తారు. రోజులు గడిచి, క్రేజు తగ్గే కొద్దీ అడ్డగోలు ధరను తగ్గించుకుంటూ అసలు సిసలు అధికారిక టికెట్ రేటు వద్దకు వస్తారు. ఆ లోగా సినిమా చూడాలంటే, ప్రేక్షకుడికి పెనుభారమే. ఈ దశాబ్దం మొదట్లో ఆరంభమైన ఈ అక్రమ వ్యాపారం ఒకప్పటి 'ఇంద్ర' దగ్గర నుంచి నేటి 'రోబో', 'ఆరెంజ్'ల వరకు అడ్డూ ఆపూ లేకుండా సాగిపోతోంది. కొన్ని ఊళ్ళలో అయితే, సినిమా తొలి నుంచి ఆఖరి రోజు వరకూ హాలులోని అన్ని తరగతులకూ ఒకే టికెట్ రేటుతో దోపిడీ సాగడం విచిత్రం.

ఇదీ తమిళం నుంచి దిగుమతే!

రజనీకాంత్ లాంటి క్రేజీ పెద్ద హీరోల చిత్రాలకు తమిళనాట ఈ 'ఫ్లాట్ రేట్లు', 'జంపింగ్ రేట్ల' పద్ధతులు అమలులో ఉన్నాయి. అక్కడ నుంచి ఈ జాఢ్యాన్ని తెలుగు చిత్రసీమ కూడా చాలా ఏళ్ళ క్రితమే అంటించుకుంది. అంతకు ముందు ఒకటి రెండు చిత్రాలకు జరిగినా, ప్రధానంగా చిరంజీవి నటించిన 'ఇంద్ర' (2002) చిత్రం నుంచి ఈ 'జంపింగ్ రేట్ల విధానం' తెలుగు నాట విస్తృత ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇలా వచ్చిన అనధికారిక సొమ్ముతో ఏ సినిమాకు ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించి, జబ్బలు చరుచుకుంటోంది.

పెట్టిన ఖర్చును గబగబా వెనక్కి రప్పించుకోవాలని భారీయెత్తున ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసిన 'రోబో' సినిమాకు టికెట్ల రేట్లు కూడా భారీగానే పెట్టారు. తమిళనాట పెద్ద పెద్ద మల్టీప్లెక్సుల్లో సైతం రూ. 120కి మించి టికెట్ రేటు ఉండకూడదనే ప్రభుత్వ నిబంధన ఉంది. దాన్ని పాటిస్తున్నట్లు నటిస్తూ, టికెట్ మీద మాత్రం మామూలు రేటే ముద్రించి, 'రోబో' / 'యంతిరన్' ప్రేక్షకులకు మాత్రం ఒక్కో టికెట్‌నూ రూ. 200

నుంచి రూ. 500 వరకు అధికారికంగా, కౌంటర్‌లోనే అమ్మేశారు. తమిళనాట తెలుగు అనువాద చిత్రం 'రోబో'ను ప్రదర్శిస్తున్న హాళ్ళు కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు. ఆ రకంగా తొలినాళ్ళలోనే సినిమా చూడాలన్న ప్రేక్షకుల ఆసక్తినీ, బలహీనతనూ ఆసరాగా తీసుకొని, డబ్బులు దండుకుంటున్నారు.

పెరిగిన టికెట్ రేట్లతో పెద్ద రికార్డులు

స్థానిక ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం కావాలని కళ్ళు మూసుకుంటూ ఉండడంతో, ఇవాళ ఈ విధానాలు ఆంధ్రదేశంలో ప్రతి అగ్ర హీరో సినిమాకూ నిత్యకృత్యమయ్యాయి. ఇప్పుడు అత్యధిక శాతం హాళ్ళ వారందరూ ఒక్కో టికెట్ రూ. 200 - 300 ఉండే 'జంపింగ్ రేట్ల' విధానాన్నే ఆశ్రయిస్తున్నారు. అగ్ర హీరోల సగటు తెలుగు సినిమా కలెక్షన్లకు సంబంధించి ఓ ఆశ్చర్యకరమైన విషయం ఉంది. ఈ అడ్డగోలు టికెట్ రేట్లతో వస్తున్న తొలి వారం వసూళ్ళే ఆ సినిమాకు మొత్తం మీద వచ్చే కలెక్షన్లలో 60 నుంచి 70 శాతం! ఇది విస్మయం కలిగించే వాస్తవం.

ప్రేక్షకులను దోచేస్తున్న ఈ పద్ధతి వల్ల ఒకే ఒక్క ప్రయోజనం ఉంది. ఫ్లాపైన సినిమా కూడా భారీగా నష్టపోకుండా, మొదటి వారం రోజుల కలెక్షన్లతో కొంత మేర పెట్టుబడిని వెనక్కి రప్పించడానికే ఈ పద్ధతి ఉపయోగపడుతోంది. దాదాపు రూ. 35 కోట్ల పైగా ఖర్చుతో రూపొంది, టైటిల్ విషయంలో తెలంగాణ ప్రాంతంలో వివాదాస్పదమైన ఓ ప్రముఖ హీరో చిత్రం ఇటీవల పెద్ద ఫ్లాపైంది. అయినా సరే, రాష్ట్రంలోని నికర వసూళ్ళు దాదాపు రూ. 15 కోట్లు. లెక్క చూస్తే, అందులో సగం ఇలా అడ్డగోలు టికెట్లతో వచ్చిన అక్రమ సొమ్మే! ఈ అడ్డగోలు టికెట్ అమ్మకాలే లేకపోతే, ఆ సినిమా మరింత నష్టపోయేది. కౌంటర్‌లోనే అమ్మిన బ్లాక్ పుణ్యమా అని అంత పెద్ద ఫ్లాప్‌లో కూడా నష్టాన్ని కొంత పూడ్చుకోగలిగింది.

పారిపోతున్న ప్రేక్షకులు - పెరుగుతున్న పైరసీ

గతంలో కింది పట్నాల్లో ఇలాంటి వినాశకర ధోరణి ఉన్నా, నెల్లూరు లాంటి పెద్ద పట్నాల్లో అధికారుల నిఘాకు వెరచేవారు. మామూలు రేట్లకే టికెట్లు అమ్మేవారు. కానీ, ఇప్పుడు అక్కడ



కూడా పరిస్థితి మారిపోయింది. అగ్ర హీరోల సినిమాను తొలి రోజుల్లో చూడాలంటే, అయిదుగురు సభ్యుల కుటుంబానికి కనీసం వెయ్యి రూపాయలు టికెట్లకే అవుతోంది! ఈ రేట్ల దెబ్బతో హాలుకొచ్చి సినిమా చూడాలంటే ప్రేక్షకుడు భయపడి పారిపోతున్నాడు. అదే సమయంలో సినిమా చూడాలనే కోరికను చంపుకోలేక, చౌకగా దొరికే పైరసీ సీడీలను అనివార్యంగా ఆశ్రయిస్తున్నాడు.

"ఇది చిత్రపరిశ్రమ స్వయంకృతాపరాధం. ప్రేక్షకులను దేవుళ్ళుగా పేర్కొంటూనే, ఎక్కువ రేట్లతో వాళ్ళను మేమే హింసిస్తున్నాం. వాళ్ళను అక్షరాలా దేవుళ్ళ లాగా చూసుకుంటేనే, వాళ్ళు ఒకటికి పదిసార్లు హాళ్ళలో సినిమా చూసి, వరాలిస్తారు. దీర్ఘకాలం పాటు పరిశ్రమను పరిరక్షిస్తారు. కానీ, అలా జరగడం లేదు" అని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి కార్యదర్శి టి. ప్రసన్నకుమార్ వాపోయారు. "పరిస్థితి ఎలా ఉందంటే - ఇవాళ వేగంగా కోడిని కోసుకు తిందామని అనుకుంటున్నామే తప్ప, గుడ్లు పెట్టే దాకా ఆగడం లేదు. రోజుకో గుడ్డు తిందామని అనుకోవడం లేదు. అదే జరుగుతున్న పెద్ద తప్పు" అని ఆయన ఆవేదనగా వ్యాఖ్యానించారు.

దొంగలకు దొంగ

ఈ పద్ధతుల వల్ల ప్రభుత్వానికి కూడా భారీ నష్టం కలుగుతోంది. నిజానికి, తెలుగు సినిమా తనకు వచ్చే మొత్తం వసూళ్ళ (గ్రాస్)లో సగటున 15 శాతం దాకా వినోదపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అదే 'రోబో' లాంటి అనువాద, పరభాషా చిత్రాలకైతే ఆ పన్ను 20 శాతం దాకా ఉంటుంది. కానీ, చిత్ర ప్రదర్శకులు తాము నిజంగా అమ్మిన టికెట్ల సంఖ్య కానీ, వాటి అడ్డగోలు రేటు కానీ బయటపెట్టరు. తక్కువ టికెట్లే, అదీ మామూలు రేటుకే అమ్ముడైనట్లు చూపిస్తారు. అలా వీలైనంత తక్కువ వినోదపు పన్ను చెల్లిస్తారు. అంటే, అడ్డగోలు టికెట్ రేట్లతో ప్రేక్షకులకే కాక, ఆ రేట్ల లెక్కన వినోదపు పన్ను కట్టరు కాబట్టి ప్రభుత్వానికి కూడా చాలా నష్టమే!

ఈ అడ్డగోలు టికెట్ రేట్ల విధానం ఓ విషవలయం. పైరసీ సహా అనేక అంశాలకు మూలమైన ఈ దోషాన్ని కనుక్కొని, దానికి సరైన మందివ్వాల్సింది పోయి, తాత్కాలిక ఉపశమనాల వైపు మన పరిశ్రమ పరుగులు తీస్తోంది. "ఇంతింత రేట్లు పెట్టి టికెట్లు అమ్మడం అన్యాయం, అక్రమం కాదా! పైరసీని తిడుతున్న వారికి దానికి మూలమైన తాము చేస్తున్న ఈ తప్పు గురించి తెలియదా! ఇది ఎలా ఉందంటే - (టికెట్లను అడ్డగోలు రేట్లకు అమ్ముతున్న) ఒక దొంగ, (పైరసీ చేస్తున్న) మరొక



దొంగను చూపెడుతూ, 'దొంగ... దొంగ...' అని అరుస్తున్నట్లుంది" అని తొలితరం సినీ పాత్రికేయుల్లో ఒకరైన ముద్దాలి సత్యనారాయణ శర్మ విమర్శించారు.

పత్రికల వారి పరోక్ష పాపం

అసలు, ఈ పాపంలో సమాచార ప్రసార సాధనాలకూ పరోక్షంగా పాత్ర ఉందంటున్నారు - తెలుగు సినీ రంగ వ్యాపార, పబ్లిసిటీ ధోరణులను 60 ఏళ్ళ పైగా నిశితంగా పరిశీలిస్తున్న సీనియర్ సినీ విశ్లేషకులు కాట్రగడ్డ నరసయ్య. "ఇవాళ దినపత్రికల్లోని సినిమా కాలమ్స్‌లో ఎంతసేపటికీ చిత్ర నిర్మాణ వార్తలు, గ్లామర్ వార్తలే ప్రచురిస్తున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా కూడా అందచందాల ప్రదర్శనలోనే పడి కొట్టుకుపోతోంది. చిత్ర పరిశ్రమలోని సమస్యలు, వర్తమానంలో ఎదురవుతున్న సంక్షోభాల గురించి రావడమే లేదు. దీని ఫలితం చాలా తీవ్రంగా ఉంటోంది" అని నరసయ్య వాపోయారు. చిత్ర నిర్మాణ వార్తలతో పాటు పంపిణీ, ప్రదర్శక రంగాలతో కూడిన చిత్ర మార్కెటింగ్ వ్యవహారాల వార్తలు, విశ్లేషణలు కూడా విరివిగా మీడియాలో రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. అలాంటి విశ్లేషణాత్మక కథనాల వల్ల మేడిపండు లాంటి చిత్ర పరిశ్రమ లోలోపలి సమస్యలు నలుగురి దృష్టికీ వస్తాయి. పరిష్కారం దిశగా ప్రయత్నాలూ జరుగుతాయి.

మరి, గడచిన వారం నుంచి రానున్న సంక్రాంతి వరకు ఎన్నో క్రేజీ చిత్రాలు విడుదలవుతున్నాయి. పైరసీ గురించి, ఆ దోపిడీ - దొంగ సొమ్ముల గురించి పెద్ద పెద్ద ఉపన్యాసాలిస్తున్న పెద్ద హీరోలు, దర్శకులు, నిర్మాతలు తమ చిత్రాల టికెట్ రేట్ల ద్వారా చేస్తున్న దోపిడీని ఆపేస్తారా? ముందుగా ప్రేక్షకులనూ, ఆ తరువాత వినోదపు పన్ను తక్కువ చెల్లింపుతో ప్రభుత్వాన్నీ నిస్సిగ్గుగా దోచేస్తూ ఆర్జిస్తున్న దొంగ సొమ్మును వదిలేస్తారా? అన్నీ తెలిసినా, ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్న మన ప్రభుత్వాధికారులు, పాలకులు కళ్ళు తెరుస్తారా? సామాన్యులు అడుగుతున్న ఈ ప్రశ్నలకు బదులేది!? ★



అదరగొట్టిన ఆసియాడ్

సత్తా చూపిన చైనా

క్రీడాజగతి యావత్తు 'జయహో జన చైనా' అంటూ నినదించింది. ఆటల ప్రపంచమంతటా గుయాంగ్జౌ నగరం పేరు మార్మోగింది. ఆతిథ్యం అంటే..నిర్వహణా చాతుర్యమంటే...ఇదిగో ఇలా ఉండాలంటూ పదిమంది ముచ్చటించుకునే రీతిలో జన చైనా 16వ ఆసియా క్రీడలను జగజ్జేయమానంగా నిర్వహించింది. 2008లో బీజింగ్ ఒలింపిక్స్‌ను నభూతో నభవిష్యత్ అన్నరీతిలో సంబరోత్సవంగా నిర్వహించిన చైనా రెండేళ్లలోనే మరో అతిపెద్ద క్రీడా వేడుకను దిగ్విజయంగా నిర్వహించి 'భళా' అనిపించుకుంది. ఒలింపిక్స్‌తో ఆతిథ్యమేంటో రుచి చూపిన ఆ దేశం ఈ ఏడాది ఆసియా క్రీడోత్సవాల నిర్వహణతో ఆటల ప్రియులకు మృష్టాన్నాన్నే వడ్డించిందని చెప్పొచ్చు. ఆరంభం అదరహో అనిపిస్తే..ముగింపు మరింత మురిపెంగా ముగిసింది. ఆసియా దేశాల ఐక్యత..స్నేహ సౌరభాలను నదీతీర నగరం గుయాంగ్జౌ విశ్వమంతా గుబాళింపజేసింది. గత నెల 12న అత్యంత వైభవోత్సవంగా ప్రారంభమైన 16వ ఆసియా క్రీడలు 16 రోజుల పాటు విజయోత్సవంగా కొనసాగి 27న అట్టహాసంతో ఘనంగా ముగిశాయి. పెర్ల్ నదీ తీరాన ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన ఈ క్రీడాసంబరాలపై సంక్షిప్త మాలిక ఈవారం అట్టమీది కథ.

ఒక ఖండం. 45 దేశాలు. 42 క్రీడలు..476 విభాగాలు. ఒకటే నినాదం 'థ్రిల్లింగ్ గేమ్స్..హార్మోనియస్ ఆసియా (సంభ్రమ క్రీడలు..సామరస్య ఆసియా). ఈ విశాల స్ఫూర్తికి జన చైనా వేదిక. పేరుకు ఒకే ఖండానికి సంబంధించిన క్రీడలైనా..ప్రపంచస్థాయి పోటీకి ఏమాత్రం తగ్గని ఆటల యుద్ధమది. ఎప్పటిలానే మన ఆశ మన దేశానికి ఏమాత్రం పతకాలు వస్తాయనే. ఆ ఆశను మదిలో ఉంచుకొనే భారత్ నుంచి దాదాపు 600 మంది పైగా ప్రతినిధి బృందం ఆసియా క్రీడోత్సవాలకు బయల్దేరింది. కామన్వెల్త్ క్రీడల్లో అగ్రస్థానంలో నిలిచి భళా అనిపించిన భారత్ ఆ సత్తా ఆసియాడ్‌లో కొనసాగిస్తుందా అన్న ఆశ అత్యాశే అయినా భారతీయులను ఊరించింది. మన క్రీడాతారలు గగన్ నారంగ్..సైనా నెహ్వాల్, పంకజ్ అద్వానీ, సానియా మీర్జా, అభినవ్ బింద్రా ఏమేరకు రాణిస్తారా అని దేశం ఎదురుచూసింది. శుభ ఘడియ దగ్గర పడింది. దిక్కులు పిక్కటిల్లేలా మతాబులు పేలాయి. గుయాంగ్జౌ టీవీ టవర్ వద్ద పేల్చిన టపాసులు గగనసీమలో శతకోటి హరివిల్లులై నయనానందకర తాండవం చేశాయి. 16వ ఆసియా క్రీడలను తమ నగరానికి ఆహ్వానిస్తూ వేలాది మంది సామాన్య ప్రజానీకం పెర్ల్ నదీ తీరాన అందమైన నౌకావేడుక చేసింది. నిండు హృదయంతో దగ్గరి బంధువుల్లా సభ్యదేశాల ప్రతినిధులను జయోస్తు అంటూ ఆహ్వానించింది. ఒక్కొక్క రోజూ గడుస్తుండగా. ఆసియా రికార్డులు..విశ్వ రికార్డులు కొన్ని బద్దలయ్యాయి. మరికొన్ని కొత్తగా

నమోదయ్యాయి. 16 రోజులు పూర్తయ్యాయి. ఆరంభంలాగే ముగింపు వేడుకలు మురిపించాయి. ఆసియా ఖండంలో వివిధ దేశాల సంస్కృతికి, సాంప్రదాయాలకు దర్పంపడుతూ ఆయా దేశాలే ఆతిథ్యమిచ్చాయా అన్నరీతిలో ముగింపు వేడుకలు జరిగాయి. వరుణుని సైతం తన సాంకేతిక నైపుణ్యంతో ప్రధాన వేదిక నుంచి దూరంగా పంపి ఏ చిన్న ఆటంకమూ లేకుండా బీజింగ్ ఒలింపిక్స్‌ను నిర్వహించిన అనుభవం చైనాది. ఆ అనుభవ సామర్థ్యంతో ఆసియా క్రీడలను మరింత మెరుగ్గా నిర్వహించి అబ్బురపర్చింది. ఇదే సందర్భంలో మన దేశం ఎంతో ప్రతిష్టాత్మకంగా చెప్పుకున్న కామన్వెల్త్ క్రీడల నిర్వహణ సక్రమంగానే ఉన్నా వేదికల డొల్లతనం..అవినీతి క్రీనీడలు చేదు జ్ఞాపకాలుగా మెదలకమానవు. కానీ చైనా ముందుచూపుతో చేసిన ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో నిర్మాణాత్మకంగా నిర్వహించిన వైనం అభినందనీయం. ఆదర్శనీయం. 16 రోజుల సంబరంలో మనవాళ్లూ రాణించారు. ఒక్కొక్కటిగా పతకాలు సాధించారు. షూటింగ్‌లో రజత పతకంతో మన హైదరాబాదీ ఆటగాడు గగన్ నారంగ్ బోణీ చేస్తే..ముగింపు వేడుకలకల్లా 14 స్వర్ణాలు, 17 రజతాలు, 33 కాంస్యాలతో మొత్తం 64 పతకాలు సాధించి ఆరోస్థానంలో నిలిచారు. జాతి పరువు కాపాడారు. అథ్లెటిక్స్, కబడ్డీ, టెన్నిస్, బాక్సింగ్‌లో మెరుగ్గా రాణించారు. కబడ్డీలో పురుషులు, మహిళలు రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు సాధించి మన 'పట్టు' బంగారం అని చాటగా..సోమదేవ్ దేవ్‌వర్మన్, జోసెఫ్ అబ్రహం, అశ్వినీ చిదానంద, తరుణ్‌దీప్ రాయ్ తారాజువ్వల్లా పతకాలు సాధించి ప్రతిష్ట తెచ్చారు. మరోవైపు ఆతిథ్య చైనా, రాబోయే 17వ ఆసియా క్రీడోత్సవాలకు ఆతిథ్యమివ్వనున్న దక్షిణ కొరియా, జపాన్ పతకాల పట్టికలో పసిడి కాంతులు విరజిమ్మాయి. చిన్నదేశాలైనా తమ క్రీడా సత్తువ తక్కువేం కాదంటూ ఇరాన్, కజకిస్తాన్ ధగధగలాడాయి. అందుకే 120 కోట్లపైగా జనసంఖ్య ఉన్న మనదేశాన్ని సైతం ఆ దేశాలు వెనక్కి నెట్టి టాప్‌టెన్‌లో నాలుగు, ఐదు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఆసియా క్రీడలు ప్రారంభమైనప్పటి నుంచి రెండున్నర దశాబ్దాల పాటు అగ్రస్థానంలో నిలిచిన జపాన్‌ను 1982 క్రీడల్లో చైనా వెనక్కి నెట్టింది. అప్పటి నుంచి జనచైనాదే అగ్రపీఠం.

చైనా సత్తువేంటి..మన నిస్సత్తువేంటి..

జనాభా రీత్యా చైనా, భారత్ ప్రపంచంలోనే తొలి రెండు స్థానాల్లోనూ కొనసాగుతున్నాయి. ఆ సంఖ్యకు ఏమాత్రం తగ్గని రీతిలో చైనా అన్ని రంగాల్లోనూ విశ్వవేదికలపై దూసుకుపోతూ అగ్రస్థానాల్లో పరిఢవిల్లుతోంది. క్రీడల్లోనూ భారత్ అందుకోలేనంత వేగిరంగా ఆ దేశం విజయాలు సాధిస్తోంది. ఇరుదేశాల్లోనూ యువత అత్యధిక సంఖ్యలో ఉన్నా..మనదేశం చైనాలా ముందుకెళ్లకపోవడానికి ప్రభుత్వ పాలకుల్లో క్రీడల పట్ల చిత్తశుద్ధి లోపించింది. దీనికితోడు బంధుప్రీతి. అన్ని క్రీడా సంఘాల్లోనూ పాలకపక్ష నేతల చొరబాటు. ప్రతిభావంతులను గుర్తించడంలో ఆశ్రిత పక్షపాతం. అవధులను మించిన బహుళజాతి సంస్థల ప్రమేయం. అయితే చైనాలో ఇందుకు భిన్నమైన వాతావరణం ఉంది. అక్కడి ప్రభుత్వం ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడంలోనూ..వారికి మెరుగైన శిక్షణను పూర్తి ప్రభుత్వ ఖర్చులతో అందించడంలోనూ ముందంజలో ఉంది. మనదేశంలో అయితే ఏదో ఒక బడా స్పాన్సర్ దొరికితేగానీ క్రీడాసౌరభాలు వికసించే స్థితి లేదు. ఆ దిశగా ప్రభుత్వ చర్యలు ఏమాత్రం లేవు. అందుకే ఈ దుస్థితి. చైనాలో మాటలు నేర్చే సమయంలోనే క్రీడాస్ఫూర్తిని రగిలించేలా పిల్లలకు తర్ఫీదునిస్తారు. మనదేశంలో సాంప్రదాయాల ఉచ్చులోకి నెట్టేస్తారు. శాంభవి లాంటి చిన్నారులను మూఢవిశ్వాసాల కూపంలోకి ఎలా నెట్టేస్తున్నారో మనం చూశాం. కానీ జన చైనాలో శారీరక, మానసిక చైతన్యం కల్గించే అలవాట్లను అత్యంత జాగ్రత్తగా తమ బుడతలకు, యువతరానికి నేర్పిస్తోంది. ఆ దిశలోనే బాల్యంలోనే కరాటే తరహా శారీరక పరిపుష్టి కల్గించే తర్ఫీదులను ఇస్తున్నారు. అందుకోసం పటిష్టమైన వ్యవస్థ ఉంటుంది. ప్రతీ పాఠశాలలోనూ క్రీడాంశం తప్పనిసరిగా ఉంటుంది. క్రీడాస్ఫూర్తిని నింపే ఏ అవకాశం వచ్చినా చైనా దానిని సద్వినియోగం చేసుకుంటుంది. ఆసియా క్రీడల ప్రచారంలో ఆ దేశం చేపట్టిన వినూత్న కార్యక్రమాలే అందుకు నిదర్శనం. బ్యాటన్ ర్యాలీ మొదలు కౌంట్‌డౌన్ ముగిసేవరకు క్రీడలు..శ్రమైక జీవన విధాన స్ఫూర్తి నింపే పలు కార్యక్రమాలను

ఆసియాడ్‌లో భారత్ స్థానం

క్రీడల క్రమం	స్వర్ణం	రజతం	కాంస్యం	మొత్తం	పొందిన స్థానం
1	15	16	21	52	2
2	5	4	9	18	4
3	5	4	4	13	7
4	10	13	11	34	4
5	7	3	11	21	4
6	6	9	10	25	5
7	6	9	10	25	28
8	11	11	6	28	6
9	13	19	25	57	5
10	5	9	23	27	5
11	1	8	14	23	11
12	4	3	15	22	8
13	7	11	17	35	9
14	11	12	13	36	7
15	10	17	26	53	8
16	14	17	33	64	6

16వ ఆసియా క్రీడల్లో టాప్‌టెన్

ర్యాంక్	దేశం	బంగారు	రజతం	కాంస్యం	మొత్తం
1	చైనా	199	119	98	416
2	ద.కొరియా	76	65	91	232
3.	జపాన్	48	74	94	216
4.	ఇరాన్	20	14	25	59
5.	కజకిస్తాన్	18	23	38	79
6.	ఇండియా	14	17	33	64
7.	చైనీస్ తైపే	13	16	38	67
8.	ఉజ్బెకిస్తాన్	11	22	23	56
9.	థాయిలాండ్	11	9	32	52
10	మలేసియా	9	18	14	41


ఇదిగో చైనా సత్తా

రూపొందించి ప్రజల్లోకి తీసుకెళ్లింది. క్రీడాస్ఫూర్తికి తోడుగా శ్రమ విలువ..పర్యావరణ ప్రాముఖ్యత అంశాలను జోడించి ఆసియా క్రీడోత్సవాల సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు వంటి పలు కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులతో పాటు సామాన్య ప్రజానీకం ఈ ప్రచారపర్వంలో పెద్ద ఎత్తున పాల్గొని దిగ్విజయం చేశారు.

ఆసియాడ్ వచ్చిందిలా...

ఒలింపిక్స్ తరవాత ఖండాంతర స్థాయి పోటీల్లో మన దేశం గత శతాబ్దం తొలినాళ్ళలో పెద్దగా పాల్గొన్నది లేదు. అయితే ఆసియాకు సంబంధించి పశ్చిమాసియా దేశాల మధ్య జరిగే క్రీడా పోటీల్లో మాత్రం పాల్గొనేది. 1913లో ఓరియెంట్ ఒలింపిక్ గేమ్స్ పేరిట ఫిలిప్పైన్స్ రాజధాని మనీలాలో తొలిసారిగా అమెరికా వలస పాలకుల ప్రోత్సాహంతో ఆసియా ఖండంలో అతి పెద్దవైన క్రీడా పోటీలు జరిగాయి. ఆసియా ఖండంలో జరిగిన మొట్టమొదటి క్రీడోత్సవం ఇదే. 1915లో చైనా నగరమైన షాంఘైలో ఫార్ ఈస్ట్ ఛాంపియన్‌షిప్స్ పేరుతో ఇవి జరిగాయి. నాటి నుంచీ ప్రతి రెండేళ్ళకోసారి 1934 దాకా పది క్రీడోత్సవాలు జరిగాయి. ఈ సమయంలోనే ఆఫ్ఘనిస్తాన్, సిలోన్ (నేటి శ్రీలంక), భారత్, పాలస్తీనా దేశాలు పశ్చిమాసియా క్రీడల్లో పాల్గొన్నాయి. 1938లో ఆసియా ఖండంపై ద్వితీయ ప్రపంచ యుద్ధం ప్రభావం కారణంగా క్రీడోత్సవాలు రద్దయ్యాయి.

ఈ క్రీడల నిర్వహణలో భాగం పంచుకున్న భారత్‌కు చెందిన ఒలింపిక్ సంఘ సభ్యుడు ప్రొఫెసర్ గురుదత్ సొంధీకి ఆసియా ఖండంలోని అన్ని దేశాలు పాల్గొనే క్రీడా పోటీలను నిర్వహించాలనే ఆలోచన కలిగింది. ఆయన ప్రయత్నాల ఫలితంగానే ఆసియా ఖండంలో ఒలింపిక్ ఉద్యమానికి ఒక రూపం వచ్చింది. 1940వ దశకంలో ఆయన తన ఆలోచనలను నాటి భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు పాటియాలా మహారాజా యదువీంద్ర సింగ్‌కు తెలిపారు.

ఈ ఆలోచన నచ్చిన ఆయన సొంధీని వెన్నుతట్టి ప్రోత్సహించారు. తన సహాయ, సహకారాలు అందించడమే కాక ఆయనతో కలిసి ప్రయత్నాలు కూడా కొనసాగించారు. 1948లో ఒలింపిక్ గేమ్స్ సందర్భంగా కలిసిన ఆసియా దేశాలకు చెందిన క్రీడాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇక్కడ జరిగిన చర్చల ఫలితంగా ఆసియా క్రీడల సమాఖ్య (ఏసియన్ గేమ్స్ ఫెడరేషన్) ఏర్పాటైంది. దీనినే 'ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా' అని కూడా అంటున్నారు. ఈ సమాఖ్యకు యదువీంద్రసింగ్ అధ్యక్షుడుగా, సొంధీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. 1949లో భారత్, శ్రీలంక, మయన్మార్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, ఫిలిప్పైన్స్, థాయిలాండ్ తదితర దేశాల ప్రతినిధులు ఢిల్లీలోని పాటియాలా హౌజ్‌లో సమావేశమయ్యారు. చర్చలు జరిపి ఆసియా దేశాలకు అనుకూలంగానూ, ఒలింపిక్ క్రీడల మాదిరిగానూ ఉండే నిబంధనావళిని రూపొందించారు. దీనినే ఆసియా క్రీడల నిబంధనలు అన్నారు. ఆసియా క్రీడల ఆవిర్భావానికి నాంది పలికిన సొంధీని ఆసియా క్రీడల పితామహుడు (ఫాదర్ ఆఫ్ ఏసియన్ గేమ్స్) అని గౌరవిస్తున్నారు.

ప్రథమ ఆసియా క్రీడలు

తొలి ఆసియా క్రీడోత్సవాలను నిర్వహించింది మనదేశంలోనే. 1950 ఫిబ్రవరిలో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అనుకున్న సమయానికి ఢిల్లీలో నేషనల్ స్టేడియం సిద్ధం కాకపోవడం వలన మరుసటి సంవత్సరానికి వాయిదా పడ్డాయి. 'ఆసియా వాసులారా పదండి ముందుకు' అనే నినాదంతో 1951 మార్చి 4వ తేదీన తొలి ఆసియా క్రీడోత్సవాలు ప్రారంభమై ఎనిమిది రోజులపాటు జరిగాయి. ఆది నుంచి వీటి ఏర్పాటుకు ఉత్సాహం చూపిన కొరియా అంతర్యుద్ధంలో చిక్కుకున్న కారణంగా పోటీలలో పాల్గొనలేకపోయింది. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, సైక్లింగ్, ఫుట్‌బాల్, ఈత, వెయిట్‌లిఫ్టింగ్ మొదలైన ఆరు అంశాల్లో 11 దేశాల నుంచి దాదాపు 600 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. మొదటి స్వర్ణ పతకం సింగపూర్ ఈతగాడు నియే చీ కాక్‌కు లభించింది. మొత్తం నాలుగు ఫ్రీస్టయిల్ ఈత పందేల్లో స్వర్ణాలు గెలిచి ప్రథమ ఆసియాడ్‌లో ఉత్తమ క్రీడాకారునిగా ఆయన ఎంపికయ్యారు. 25 స్వర్ణ పతకాలతో జపాన్ ప్రథమ స్థానం పొందింది. ఆతిథ్యమిచ్చిన భారత్ 13 పతకాలతో రెండవ స్థానంలో నిలిచింది. మొదటి ఆసియా క్రీడల్లో రాష్ట్రానికి చెందిన కామినేని ఈశ్వరరావు పాల్గొని వెయిట్ లిఫ్టింగ్‌లో వెండి పతకం



16వ ఆసియా క్రీడల విశేషాలు

ప్రధాన వేదిక : గుయాంగ్జౌ

నినాదం : సంబ్రమ క్రీడలు–సామరస్య ఆసియా

➡ఆది, అంత్య స్వర్ణ పతకాలను ఆతిథ్యదేశం చైనానే సొంతం చేసుకుంది.

➡బాగా రాణిస్తుందనుకున్న జపాన్ 48 స్వర్ణాలు, 216 పతకాలతో సరిపెట్టుకుంది.

➡అనూహ్యరీతిలో దక్షిణ కొరియా జపాన్‌ను వెనక్కి నెట్టి 76స్వర్ణాలతో 232 పతకాలు కైవసం చేసుకుంది.

➡ వేడుకల్లో చైనా, భారత్, లెబనాన్, జపాన్, కజకిస్తాన్, మంగోలియా సహా ఆసియా సాంస్కృతిక, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన సంగీత, నృత్య కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి.

➡ మనదేశం తరపున లక్నోకు చెందిన సింగర్ రవి కె త్రిపాఠి, జమ్మూకాశ్మీర్‌కు చెందిన తాన్యాగుప్తా బృందం నృత్యాలు చేస్తూ స్వరాలాపన చేసి అలరించారు. వేదికపై ఏర్పాటు చేసిన తెరలపై మన తాజ్‌మహల్ సహా ఆసియాలోని ప్రసిద్ధ కట్టడాలను ప్రదర్శించి ఆయా దేశాల అభిమానాన్ని నిర్వాహకులు మూటగట్టుకున్నారు.

➡ఆరంభ వేడుకల పెరేడ్‌లో మనదేశ ప్రతినిధి బృందం తరపున షూటర్ అభినవ్ బింద్రా మువ్వన్నెల జెండా చేబూనగా..ముగింపోత్సవాల్లో స్వర్ణపతక బాక్సర్ వీరేంద్ర సింగ్ మూడురంగుల జెండాను చేతబట్టి నాయకత్వం వహించారు.

➡ 'పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలవడం ఆసియాలో ఏకఛత్రాధిపత్యం సాధించినట్లుకాదు. సాంప్రదాయ క్రీడల్లో మేం బాగా రాణించాం. మరికొన్ని క్రీడల్లో అంత ప్రతిభ చాటలేకపోయాం' అని ఈ క్రీడల్లో చైనాకు నేతృత్వం వహించిన సియో జియాడాంగ్ ప్రకటించి క్రీడాస్ఫూర్తి నింపారు.

➡ ఈ క్రీడల సందర్భంగా 12,600 డోపింగ్ టెస్టులు నిర్వహించారు. ఉజ్బెకిస్తాన్‌కు చెందిన వస్తాదు జాఖోంగిర్ ముమినోవ్, జూడో క్రీడాకారుడు షోకిర్ ముమినోవ్ మాత్రమే దొరికిపోవడం విశేషం.

➡ వివిధ అంశాల్లో 103 ఆసియా రికార్డులు నెలకొనగా..మూడు ప్రపంచ రికార్డులు కూడా నమోదయ్యాయి.

(వీటిలో వెయిట్‌లిఫ్టింగ్‌లోనే రెండు నమోదుకాగా, ఇంకొకటి ఆర్చరీలో నమోదైంది.)



భారత్ కబడ్డీ పట్టు బంగారం

సాధించారు. దండమూడి రాజగోపాలరావు హెవీ వెయిట్ పోటీల్లో కాంస్య పతకం సాధించారు.

గుయాంగ్జౌలో తెలుగు వెలుగులు

ఆసియా క్రీడోత్సవాల్లో మన రాష్ట్ర క్రీడాకారులూ సత్తా చాటారు. తెలుగు వెలుగులు విరజిమ్మారు. భారత్‌కు పతకాల బోణీ చేసింది మన హైదరాబాదీ షూటర్ గగన్ నారంగే. పది మీటర్ల ఎయిర్‌ఫైరింగ్‌లో అభినవ్ బింద్రా, సంజీవ్ రాజ్‌పుత్‌తో కలిసి గగన్ పతకం సాధించారు. వ్యక్తిగత విభాగంలోనూ ఆయన మరో రజతం సాధించి సత్తా చాటారు. మన రాష్ట్రానికి చెందిన తేజస్విని నేతృత్వం వహించిన కబడ్డీ మహిళల జట్టు ఈ క్రీడల్లో స్వర్ణం సాధించింది. ఈ జట్టు సభ్యులైన మమతా పూజారి, మారెళ్ల కళ్యాణి కూడా మన తెలుగువారే కావడం విశేషం. ఇక బాక్సింగ్‌లో 64 కిలోల విభాగంలో వైజాగ్ యువతేజం వీరోతు సంతోష్‌కుమార్ ఫైనల్‌కు దూసుకెళ్లి పసిడి ఆశలు రేపి..అందులో ఓడిపోయారు. అయితే అంతర్జాతీయ వేదికపై రజతం సాధించి సత్తా చాటారు. స్కేటింగ్‌లో హైదరాబాద్‌కు చెందిన అనూప్ రెండు కాంస్యాలు సాధించారు. వీటిలో ఒకటి వ్యక్తిగత విభాగంలో కాగా, మరొకటి విశాఖపట్నం అమ్మాయి అవనితో కలిసి పెయిర్ స్కేటింగ్‌లో కావడం ఆనందకరం. చదరంగంలో టీమ్ ఈవెంట్‌లో భారత్ కాంస్య పతకం సాధించడంలోనూ మన రాష్ట్ర క్రీడాకారుడు వరల్డ్ గ్రాండ్‌మాస్టర్ పి.హరికృష్ణ కీలక పాత్ర పోషించడం అభినందనీయాంశం. ఇక హైదరాబాదీ టెన్నిస్ సంచలనం సానియా మీర్జా మన రాష్ట్రానికే చెందిన విష్ణువర్ధన్‌తో కలిసి రజతం సాధించగా, సింగిల్స్‌లోనూ కాంస్యం సాధించి సత్తా చాటారు.

స్ఫూర్తినిచ్చే ప్రీజా పరుగు

కష్టాలు ఎదురైతే వాటికి దూరంగా పరుగెట్టాలనుకుంటారు. కానీ ఆసియా క్రీడల్లో పదివేల పరుగు పోటీలో స్వర్ణం సాధించిన ప్రీజా శ్రీధరన్ కూడా కష్టాలతోనే పరుగులెట్టారు. కేరళలోని ముల్లాక్కానాం అనే మారుమూల పల్లెలో 1982లో ప్రీజా జన్మించారు. తనకు ఎనిమిదేళ్లప్పుడు నాన్న చనిపోయాడు. ముగ్గురు ఆడపిల్లలు, ఓ అబ్బాయి. కుటుంబపోషణ భారంగా మారింది. అమ్మ పాచిపనులు చేసేందుకు వెళ్లేది. అన్న ఎనిమిదో తరగతిలోనే చదువు మానేసి అమ్మకు చేదోడయ్యాడు. ప్రీజా కష్టాలు అలా కొనసాగాయి. పరుగుకు ప్రాణమిచ్చే ప్రీజా కష్టాల్లో ఇక ఎలా అనుకుంది. అమ్మ అడ్డుచెప్పలేదు. ఇబ్బందులెప్పుడూ ఉంటాయి. నీ చదువు, ఆట దేనిని ఆపవద్దని ప్రోత్సహించారు. ప్రీజాశ్రీధరన్ వెను తిరిగి చూసుకోలేదు. అమ్మ ఇచ్చిన ప్రోత్సాహంతో పరుగు కొనసాగించింది. అందుకే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పతకాలు ఆమె ఇంటికి పరుగు పెట్టాయి. 1999లో హాంకాంగ్ ఏషియన్ క్రాస్ పోటీల్లో ప్రీజా సభ్యురాలుగా ఉన్న జట్టు రజత పతకం సాధించింది. ఇటు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తూనే ప్రీజా చదువును కొనసాగించింది. ఎంఎ చేసింది. ఈ నేపథ్యంలో ఆమెకు రైల్వేలో చిరు ఉద్యోగం దొరికింది. కుటుంబం పాలక్కాడ్‌కు మారింది. ఉద్యోగం వచ్చినా..కుటుంబం కుదుట పడినా ఆమె పరుగు ఆగలేదు. 2000లో ఎస్ఎఎఫ్ క్రీడల్లో 5000మీటర్ల ఈవెంట్‌లో స్వర్ణం సాధించారు. 2004 ఏషియన్ ఇండోర్ మీట్‌లోనూ పసిడి పతకం చేజిక్కించుకున్నారు. 2006 ఏషియన్ అథ్లెటిక్స్‌లో రజతం, 2008లో ఒలింపిక్స్‌లో వెయ్యి మీటర్ల పరుగుపోటీలో రాణించలేకపోయారు. న్యూఢిల్లీలో జరిగిన కామన్వెల్త్‌లోనూ తీవ్ర జ్వరంతో ఆమె పాల్గొనలేకపోయారు. ఈ చేదు జ్ఞాపకాలు వెన్నంటే మెదులుతున్నా ఆమె ఆసియా క్రీడలకు సిద్ధమయ్యారు. పదివేల పరుగుల ఈవెంట్‌లో పసిడి సాధించిన ఈ పరుగుల రాణి విజయం స్ఫూర్తిదాయకం.

ఈసారి కబడ్డీ కూత వినిపించదు!

గుయాంగ్జౌలో కబడ్డీ మహిళలు, పురుషుల విభాగాల్లో స్వర్ణాలు సాధించి మనం సత్తా చాటాం. అయితే 2014లో దక్షిణకొరియాలోని ఇంచియాన్‌లో జరిగే 17వ ఆసియా క్రీడల్లో క్రీడాంశాలను 42 నుంచి 35కు కుదించారు. దీంతో కబడ్డీని తొలగించే వీలుంది. 1990లో ఈ క్రీడాంశాన్ని ఆసియా క్రీడల్లో ప్రవేశపెట్టినప్పటి నుంచి భారత్ ఖాతాలో ఓ స్వర్ణ పతకం కచ్చితంగా చేరుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో కబడ్డీని తొలగించడంపై ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ (ఒసిఎ)పై భారత్ ఒలింపిక్ సంఘం అసంతృప్తిని, ఆందోళనను వ్యక్తం చేసింది. అయితే దీనిపై తుది నిర్ణయాన్ని ఒసిఎ వచ్చే నెలలో ప్రకటిస్తుంది.

- బి. అమరనారాయణ

కథ

బరాణీ

కన్నడ మూల కథా రచయిత : వీరభద్రప్ప

అనువాదం: శ్రీసాయిపల్లవి

నాన్న వచ్చాడన్న వార్త చెవిన పడగానే బసవప్పకు నోట్లో నీళ్ళూరాయి. జారుతున్న నిక్కరును పైకి లాక్కుంటూ పరిగెత్తుకు వచ్చాడు. కడుపులో ఆకలి అవుతుంది. 'నాన్న తను తినటానికి ఏదో ఒక్కటి తెచ్చే ఉంటాడనుకున్నాడు' ఆశగా. ఇంటి అరుగుమీద సగం కాల్చిన బీడీ నోట్లో పెట్టుకుని తండ్రి కనిపించాడు. భలే సంతోషం వేసింది. అంతలోనే అది ఆవిరైంది కూడా. "అదేమిటి? తండ్రి తనను దగ్గరకు తీసుకోలేదు. ఎప్పటి మాదిరిగా ప్రేమగా వీపు నిమిరి ఐదు పైసలో పది పైసలో చేతిలో ఉంచలేదు?" అనుకున్నాడు. తండ్రి ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. అదేమై ఉంటుంది? బసవప్ప చిన్న మెదడుకి సమాధానం చిక్కలేదు. విచారంగా ఇంటిలోపలికి నడిచాడు. అమ్మ ఏదో వంటకం సిద్ధం చేస్తోంది. ఒక గిన్నెలో బెల్లం తురుమూ- పక్కనే మరో గిన్నెలో మినప్పిండి కనిపించాయి. కాస్త బెల్లం ముక్క తుంపుకుని నోట్లో వేసుకుంటూ 'అమ్మా! ఈ రోజేంటి? ప్రత్యేకమైన వంటకం ఏదైనా చేస్తున్నావా?' అనడిగాడు ఆత్రంగా. అతని ఖాళీ కడుపులోకి బెల్లం ద్రవంలా జారింది. చంద్ర, కోత్రా, తిమ్మి గిన్నెలకు దగ్గరగా కూర్చుని ఉన్నారు. ముట్టుకుంటే అమ్మ తిడుతుందని వారికి భయం.

తిమ్మి ఇంకా పాలు తాగుతోంది. అమ్మను అంటిపెట్టుకునే ఉంటుంది. పాలు కుడపమని ఎప్పుడూ మారాం చేస్తుంది. తనకి తగినన్ని పాలు లేవని అమ్మకు తెలుసు. అందుకే పాలకోసం తిమ్మి అరిచి గీపెట్టినా కాసేపు పాలు కుడిచినాక బలవంతంగా ఎత్తికింద కూర్చోబెడుతుంది. ఇప్పుడేమిటో చిత్రంగా తిమ్మి పాలు కోసం దగ్గరకు రాగానే - బలంగా గుండెలకు హత్తుకుని వెక్కి వెక్కి ఏడవటం ప్రారంభించింది. ఆమె దు:ఖానికి కారణమేమిటో బసవప్పకు అర్థంకాలేదు. మరో బెల్లం ముక్క తీసుకుంటూ 'నువ్వు చేస్తున్నదేమిటో చెప్పు' అన్నాడు. చిరిగిన పైట కొంగుతో కళ్లు తుడుచుకుంటూ ఆమె చెప్పింది.

"హగ్గి..."

ఆ మాట వినగానే బసవప్పకు ఎక్కడలేని సంతోషం వేసింది. 'ఈ విషయం వెంటనే నా స్నేహితులకు తెలియచేయాలి' అనుకున్నాడు ఉత్సాహంగా. భీమా, సోఛా మిగిలిన వాళ్లందరికీ ఇప్పటికిపుడే చెప్పాలి అనుకుంటూ - మళ్లీ హడావిడిగా బయటకొచ్చాడు. వీధి అరుగుపైన తండ్రి కనిపించాడు. బసవప్పను దగ్గరకు పిలిచి పక్కన కూర్చోబెట్టుకున్నాడు. "ఆయన కంట కన్నీరు....పిల్లలకి సరైన తిండి పెట్టడం లేదని దు:ఖిస్తున్నాడు కాబోలు" - తండ్రి గురించి మనసులోనే అనుకున్నాడు వాడు.

జేబులో నుంచి పది పైసలు తీసి బసవ చేతిలో ఉంచాడు. ఆ డబ్బులు చూడగానే కళ్లు మెరిశాయి. వాడిలో మునుపటి ఉత్సాహం ఉరకలేసింది. స్నేహితుల దగ్గరకు పరుగుతీశాడు.

సోఛా ఇంటి సమీపానే కనిపించాడు. వేప చెట్టు కింద నిలబడి ఉన్నాడు. "నిన్నగాక మొన్న తననేమన్నాడు కరవు వెధవ అని కాదూ" గుర్తు చేసుకుంటూ -

"ఇదిగో - ఈ రోజు మా ఇంట్లో హగ్గి చేసుకుంటున్నాం" వాడికి చెప్పాడు బసవప్ప.

'వెధవ ఈపాటికి మనసులో కుళ్ళుకుని ఉంటాడు' అనుకుంటూ

అవతల నుంచి సమాధానం కోసం ఎదురు చూడకుండా ఎంకప్ప శెట్టి షాపుకి పరుగు పెట్టాడు. గల్లా పెట్టి ఎదురుగా - జంధ్యంతో వీపు గోక్కుంటూ కనిపించాడు శెట్టి. పదిపైసల నాణాన్ని అతని వైపుకు జరుపుతూ బరాణీలు కావాలని అడిగాడు బసవప్ప. వాటిని బసవప్ప పై జేబులో నింపాడు. గుప్పిట కొన్ని తీసుకుని నోట్లో వేసుకున్నాడు. అన్నీ తినేస్తే కడుపు నిండిపోతుంది. ఇంటికెళ్లాక 'హగ్గి' తినాలి కదా! జ్ఞాపకం చేసుకుంటూ జేబును అరచేత్తో గట్టిగా పట్టుకుని మళ్లీ ఇంటిదారి పట్టాడు. పరిగెత్తుతూ రావటంవల్ల విపరీతమైన ఆయాసం వచ్చింది. ఇల్లంతా పొగ కమ్మి ఉంది.

చంద్ర, కొత్రా, తిమ్మి దేనికోసమో ఏడుస్తున్నారు. వాళ్ల కళ్లల్లో నుంచి ముక్కుల్లో నుంచి నీళ్లు కారుతున్నాయి. అమ్మ పొగ ఊదుతోంది. గొట్టంలో నుంచి గట్టిగా ఊదటం వల్లేమో ఆమెకు దగ్గు వచ్చింది. శరీరమంతా ఎముకల గూడులా ఉంది. చిరిగిన జాకెట్‌లో నుంచి వీపు భాగం కనిపిస్తోంది. బసవప్పకు అమ్మను అలా చూడగానే- గట్టిగా గుండెలకు హత్తుకోవాలనిపించింది. ఇంతలో పొగ నెమ్మదించింది. చీరతో ముక్కూ, మొహం తుడుచుకుని బసవప్పను చూస్తూ ఆమె గాఢంగా నిట్టూర్చింది. బసవప్ప జేబులో నుంచి కొన్ని బరాణీలు తీసి తమ్ముళ్లకి, చెల్లెలికి పెట్టాడు. ఆ తర్వాత వచ్చి తండ్రి పక్కన కుర్చున్నాడు. వాడి మనసంతా హగ్గిపైనే ఉంది.

చిన్న వాళ్లంతా పెట్టమని గోల చేస్తున్నారు అప్పటికే అమ్మా, నాన్న మౌనంగా ఉన్నారు. నిర్లిప్తంగా కనిపిస్తున్నారు. దేనికో బసవప్పకు అర్థం కాలేదు.

"ఎప్పుడు పూర్తవుతుందమ్మా! " ఆపుకోలేక ఆ మాట బయటకే అనేశాడు.

"అవుతుంది.కాసేపు ఓపిక పట్టు" తండ్రి మృదువుగా తన వీపు నిమురుతూ చెప్పాడు.

అమ్మ బెల్లం తురుముని- ఓవెన్‌లో ఉన్న గిన్నెలో వేయటం వాడికి కనిపించింది. అప్పటికే జేబులో బరాణీలు ఖాళీ అయ్యాయి. హగ్గి తినాలన్న ఆత్రంతో వాడి నోట్లో లాలాజలం ఊరుతోంది.

తండ్రి వాడితో మాట్లాడటం ప్రారంభించాడు.

'నాన్నా! మనం ఈ ఊరినుంచి దూరంగా వెళ్లిపోతున్నాం. నువ్వు గౌడ ఇంట్లో ఉండాలి. అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేశాను".. ప్రేమగా చెప్పాడు.

"అహా! నేనుండను. నీతోనే వస్తాను"... దాదాపు ఏడ్చినంత పని చేశాడు బసవప్ప.

ఆ నిముషంలో అమ్మ,నాన్న ఒకరివైపు మరొకరు చూసుకోవటం-

కళ్లతోనే ఏదో మాట్లాడుకున్నారని

గ్రహించాడు వాడు.

"ఇక్కడేముంది బూడిద. కరువు, ఆత్మహత్యలు .హోస్పేట పోయి ఏదో ఒకటి చేసుకొని బతుకుతాం" రెండు రోజుల క్రితం తండ్రి నిజలింగప్పతో మాట్లాడిన మాటలు జ్ఞాపకానికొచ్చాయి.

అన్నం వండుతున్నప్పుడు అమ్మతో కూడా నాన్న ఇవే మాటలు చెప్పాడు.

"ఇంకెన్ని రోజులు. మన కష్టాలు తీరిపోతాయి" అన్నాడు.

అసలు విషయం అదన్నమాట" అనుకున్నాడు బసవప్ప. అతనికి భయం వేసింది భవిష్యత్తుపైనే. అయితే లోపల హగ్గీ కోసం తమ్ముళ్ల పోరాటంతో అతని ఆలోచనలు మళ్లాయి.

గబుక్కున లోపలికి జొరబడి ఆ పక్కనే ఉన్న అల్యూమినియం ప్లేటు తనూ అందుకున్నాడు. వాళ్లతో పోటీ పడ్డాడు. అందరూ గిన్నె చుట్టూ మూగారు. నాకు ముందంటే నాకు ముందని గోల చేయటం ప్రారంభించారు. అమ్మ ఓవెన్‌లో నుంచి పదార్థాన్ని పక్కనున్న నల్ల వస్త్రంలోకి జార్చింది. ఎప్పడెప్పుడు తిందామాఅని పిల్లలంతా ఆత్ర పడుతున్నారు. జిహ్వ గ్రంథులు వారిని మరింతగా ప్రేరేపిస్తున్నాయి. బసవ ప్లేటు ఎత్తి అమ్మ ముందుంచాడు. 'ముందు గౌడ ఇంటికి వెళ్లి గిన్నె ఇచ్చేసిరా. వచ్చాక ఇది తిందువు గాని...' అన్న తల్లి మాటలు వాడికి రుచించలేదు.

"నేను తిన్న తర్వాత గౌడ ఇంటికి వెళతాను. ముందు నాకు పెట్టు" అంటూ పట్టు పట్టాడు.

'నాకు బాగా ఆకలిగా ఉంది' అని చెప్పాడు కూడా.

"పోనీ...కాస్త పెట్టరాదూ!"

తండ్రి మధ్యలో జోక్యం చేసుకోవటం వాడికి నచ్చింది. "అమ్మ రెండు పెద్ద స్పూన్లతో హగ్గీ తీసి ప్లేటులో వేసింది. "ఇప్పటికింతే" చెప్పింది. వాడు వదలలేదు. ఇంకాస్త కావాలని పట్టుపట్టి సాధించుకున్నాడు. వేడిగా ఉన్న ఆ పదార్థాన్ని గబుక్కున తినటం చాలా కష్టమైంది. అయితే ఆత్రం వల్ల వేడిని కూడా అంత లెక్క చెయ్యలేదు వాడు.

"ఇంకా రెండు రోజులు తిండి లేకుండా పస్తులుంటేనేం? ఇప్పటికి దక్కింది చాలు" తృప్తిగా అనుకున్నాడు. ప్లేటులో అడుగున ఉన్న పదార్థాన్ని కూడా వేలితో నాకి శుభ్రం చేశాడు.

మరి కాస్త పెట్టమని గోల చేసినా ఈసారి తల్లి తనని కనికరించలేదు. గౌడ ఇంటికి వెళ్లమని పోరు పెట్టింది. నాలుగు తగిలిస్తానని తండ్రి కూడా బెదిరించేసరికి-బరువైన గిన్నె పట్టుకొని బలవంతంగా బయటకు నడవవలసి వచ్చింది.

"తాను మళ్లీ వచ్చేసరికి- హగ్గీ కాస్తంతయినా మిగులుతుందో లేదో"-వాడిలో దిగులు మొదలయ్యింది. పరుగున వెళ్లి రావాలి అనుకుని అలా మొదలు పెట్టాడో, లేదో తల్లి వెనక్కి పిలిచింది. మరి కాస్త హగ్గీ పెట్టటానికి ఆమె తనని పిలిచిందేమో అనుకున్నాడు. తీరా చూస్తే ఆమె గుమ్మం దగ్గర నిలబడి ఉంది. మూతికి చీరకొంగు అడ్డం పెట్టుకుని కనిపించింది. ఆమె ఏడుస్తోందన్న విషయం వాడికి అర్థమైంది.

వాడిని ఓసారి దగ్గరకు పిలిచి ఆత్మీయంగా వీపు నిమిరి

"ఇక వెళ్లు" అంది.

'అమ్మా! నువ్వు దేనికి ఏడుస్తున్నావ్?' అడిగాడు అమాయకంగా. ఆమె బదులివ్వలేదు. మౌనంగా చూస్తుండిపోయింది.

"నేను వచ్చే వరకూ హగ్గీ మిగిల్చి ఉంచు" చెప్పేసి బసవప్ప బయలుదేరాడు.

తాయవ్వ గుడి మలుపు తిరుగుతుండగా- భీమా కనిపించాడు.

'ఏమిటి? హడావిడిగా వెళుతున్నావ్' అడిగాడు. వాడితో కాసేపు మాట్లాడాలనిపించినా-

"మేము మా ఇంట్లో హగ్గీ చేసుకున్నాం" అని చెప్పేడు.

గబగబ ముందుకు సాగాడు. గౌడ ఇంటికి అడ్డదారుంది. రోజు అదే దారిలో అమ్మ, తాను గౌడ ఇంటికి పనికి వెళతారు. అమ్మ ఆ ఇంట్లో గిన్నెలు కడుగుతుంది. ఒక్కసారి భారీసైజు గిన్నెలను, గుండిగలను శుభ్రం చేస్తుంది.

వాటన్నింటి మధ్యా అమ్మ వాడికి చిన్న పిచ్చికలా కనిపించేది.

ఆ గిన్నెల్లో మిగిలిన పదార్థాలన్నింటిని తీసి తన కడుపు నింపేది.

అక్కడ అమ్మ చేసే చాకిరి చూసి బసవకి కళ్లలో నీళ్లు తిరిగేవి.

గౌడ ఇంట్లోకి వెళ్లబోతున్న వాడల్లా ఒక్కసారి ఆగాడు బసవప్ప.

గేటుకున్న వైర్ ఫెన్సింగ్ వెనకాల గోధుమరంగు కుక్క కనిపించింది. ఒక సారి భయం వేసింది. లోపల్నించి వణుకు. అయితే తను రోజూ చూసే వ్యక్తి కావటంతో బసవను చూడగానే గుర్తుపట్టాక అది తోకాడించింది.

అంతే ఎక్కడలేని ధైర్యం వచ్చింది. తనెప్పుడూ ఒంటరిగా ఈ ఇంటికి రాలేదు. వెంట అమ్ముండేది. ఏదో తెలియని జంకు అతన్ని వెంటాడుతోంది. పశు వుల షెడ్‌దాటి - మెట్లెక్కి వరండాలోకి



ప్రవేశించాడు.

గౌడ ఎదురుగా కనిపించాడు. ఈజీ చెయిర్లో కూర్చున్నాడు. బసవను చూడగానే-

"రా వచ్చావా! ఎప్పుడొస్తావా అని ఎదురు చూస్తున్నాను.

మీ నాన్నతో అన్నీ మాట్లాడాను" అన్నాడు.

ఇంతకు ముందు చూసిన కుక్క కంటే భయంకరంగా కనిపించాడు.

బసవకు భయం వేసింది. రెండడుగులు వెనక్కి వేసి "అమ్మ నన్ను వెంటనే వచ్చెయ్యమంది" అన్నాడు. వెనక్కి తిరిగి వచ్చేద్దామనుకునే లోపే గౌడ కుర్చీలో నుంచి లేచి అతన్ని ఆపేశాడు.

"నువ్వెక్కడికి వెళ్లేది. మీ నాన్న నా దగ్గర చేసిన అప్పులకు గాను నిన్ను కుదువ పెట్టాడు" అన్నాడు. ' నువ్వు తిరిగి వెళ్లినా వాళ్లు ఇంట్లో ఉండి ఉండరు. ఈ పాటికి వేరే ఊరు చేరుకుంటారు" చెప్పాడు భయపెడుతున్నట్టుగా. బసవ భయంతో వణికిపోయాడు. వాడికి గట్టిగా ఏడవాలనిపించింది. గౌడ గుబురు మీసాలు చూసి ఆ పని చేయలేకపోయాడు. ఏమయితే అదవుతుందని- "గౌడా! నీ దగ్గర నేనుండను. నేను అమ్మానాన్నలతోనే ఉంటాను" అన్నాడు. చొక్కా కొసలని పైకి తీసుకుని కన్నీళ్లని తుడుచుకున్నాడు.

గౌడ వాడికి మరింత దగ్గరగా వచ్చాడు. "నువ్వు మీ అమ్మనాన్నతోనే ఉంటానంటావు సరే. మరి నా అప్పు తీరే దారేదీ? ఐనా నువ్వు భయపడాల్సింది ఇక్కడేమి లేదు. పశువులకు కావలి ఉంటే చాలు. కావలసినంత భోజనం దొరుకుతుంది" చెప్పాడు అనునయంగా. బసవప్ప గౌడ తనని ఎక్కడ పట్టేసుకుంటాడోనని భయపడ్డాడు. నేను ఇక్కడ ఉండను. అమ్మానాన్న దగ్గరకెళతాను. అరుస్తూ ఒక్క ఉదుటున వరండాలోనుంచి బయటకు పరుగుతీశాడు. మొరుగుతూ గౌడ ఇంట్లో కుక్క కూడా అతన్ని అనుసరించింది. అయితే అది బసవ వేగాన్ని అందుకోలేకపోయింది. ఇంట్లో వాళ్లు ఊరు దాటేలోపు వాళ్లని పట్టుకోవాలి. పట్టుదలగా పరిగెత్తాడు.

"ఒకవేళ వారు వెళ్లిపోయుంటే ఏం చేయాలి?

ప్రశ్న ఓ వైపు మనసును తొలుస్తున్నా లెక్క చెయ్యలేదు. ఇంటి దగ్గరకు చేరే వరకూ వేగం తగ్గించలేదు. ఇంటి తలుపులు తెరిచే ఉన్నాయి. అంటే గౌడ చెప్పింది అబద్ధమన్న మాట. ఇప్పుడు ఒక సమస్య తీరింది. 'హగ్గీ మిగిలి ఉందో లేదో చూడాలి' అనుకుంటూ లోపలికి వెళ్లపోబోతుండగా – కుంటుతూ కుక్క అతన్ని సమీపించింది. అది విపరీతంగా రొప్పుతోంది. దాన్నెవరో చితక బాదుంటారనిపించింది. బసవ దాన్ని బుజ్జగించి దగ్గరకు తీసుకున్నాడు. ప్రేమగా దాని శరీరాన్ని తడిమాడు. అతని పాదాల దగ్గర అది కన్నుమూసింది. "అయ్యో ! కుక్క చచ్చిపోయిందే" అనుకుంటూ వాడు లోపలికి నడిచాడు. ★

ఉత్తేజమిచ్చే యోధుడు

కాకలు తీరినయోధుడు, నికొలాయ్ ఓస్త్రోవ్‌స్కీ
పేజీలు-286, వెల-100/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

నికోలాయ్ ఆస్ట్రోవస్కీ రాసిన హౌ ద స్టీల్ వాజ్ టెంపర్డ్ ప్రపంచ పోరాట సాహిత్యంలో పేరెన్నిక గన్నది. సోవియట్ విప్లవ విజయానంతరం నూతన సమాజ నిర్మాణంలో నిమగ్నమైన నిబద్ధ యువత సాహస ప్రవృత్తిని త్యాగ నిరతిని కళ్లకు కట్టే ఈ రచనను ప్రసిద్ధ రచయిత మహీధర రామమోహన రావు 'కాకలు తీరిన యోధుడు' పేరిట తెలుగులో అనువదించారు. ఆయనే గొప్ప రచయిత కావడంతో ఈ నవల అనువాదం అనిపించకుండా అణువణువూ ఆకట్టుకునేలా అందమైన భాషలో అందించ గలిగారు. మొదట్లో రెండు భాగాలుగా ముద్రితమైనా తర్వాత ఒకటే పుస్తకమైంది.దాదాపు అయిదు వందల పేజీలున్న ఈ పుస్తకాన్ని మూడువందల పైచిలుకు పేజీలకు సంక్షిప్తం చేసి ఇప్పుడు ప్రచురించారు.పావెల్ అనే కుర్రాడు కఠోర జీవన పోరాటంలో ఢక్కామొక్కీలు తింటూ ప్రేమలోనూ పాఠాలు నేర్చుకుంటూ యువ కమ్యూనిస్టుగా స్థిరపడతాడు. కులీన వర్గపు యువతితో మొదలుపెట్టి జీవితంలో మరికొంతమంది మహిళలు అతనికి తారసపడతారు. మరో వంక నూతన సమాజ నిర్మాణంలో సమస్యలూ సవాళ్లు ప్రత్యక్షంగా చూస్తాడు.యుద్ధరంగంలో రాజీలేని పోరాటాల ఫలితంగా అతనికి శారీరక వైకల్యం కలుగుతుంది.చివరకు చూపు కూడా పోతుంది. ఆ దశలో తన సహాయం అవసరమైన ఒక యువతిని పెళ్లాడి బలవంతంపై బాధ్యతలు విరమిస్తాడు. ఏ బాధ్యతలూ చేయలేని స్థితిలోనూ నిస్తబ్దంగా వుండిపోవడం ఆయన వల్ల కాదు. అందుకే తన అనుభవాలను అక్షర రూపంలో ఇమిడ్చి అందించాలనుకుంటాడు. రాతలో శిక్షణ పొంది రంగంలోకి దిగి కోరుకున్న పని పూర్తిచేస్తాడు. ఆ రచన జనాన్ని ఉర్రూతలూపడమే గాక సాహిత్య పురస్కారాలు కూడా పొందడంతో తన్మయుడవుతాడు. కరవాలం తిప్పలేనినాడు కలంతోనైనా ఆశయాన్ని కొనసాగించవచ్చునన్న సందేశాన్ని మిగిల్చిన ఆస్ట్రోవస్కీ రచనలో ప్రతి వాక్యమూ సజీవంగా సాక్షాత్కరిస్తుంది. ఉద్యమాలలో పనిచేసేవారికి ప్రాణవాయువై ప్రేరణనిచ్చే మహాద్భుత వాస్తవిక గాథ.

కొత్త పుస్తకాలు

వీరనారి సమర గాథ

నేతాజి సైన్యంలో నేను, నా దళం
కెప్టెన్ లక్ష్మీ సెహగల్, పేజీలు-86, ధర-30/-, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

భారత దేశంలో మన మధ్య సజీవంగా వున్న వీరనారీమణులలో ప్రథమ స్థానం అలంకరించదగిన కెప్టెన్ డాక్టర్ లక్ష్మీ సెహగల్ ఆత్మకథ ఆద్యంతం ఉత్తేజకరంగా నడుస్తుంది. నేతాజీ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరి రాణీ ఝాన్సీ రెజిమెంట్ కమాండర్‌గా కదం తొక్కిన డా.లక్ష్మీ సెహగల్ వాస్తవంలో నార్మన్ బెతూన్, కోట్నీస్‌ల కోవలో చెప్పుకోదగిన యోధ. అమ్మమ్మ దగ్గరే స్వతంత్ర భావాలు అలవర్చుకున్న లక్ష్మీ వైద్య విద్య చదివి విదేశాలకు వెళ్లినా దేశ స్వాతంత్ర సాధనకు అంకితమయ్యారు.నేతాజీ సైన్యంలో మొదట వైద్య సేవలందిస్తూనే ప్రత్యక్షంగా సమరంలో పాల్గొనాలని తహతహలాడారు. ఆమెతో సుదీర్ఘంగా చర్చించిన మీదట తను కెప్టెన్‌గా తొలి మహిళారెజిమెంటును ఆయన ఏర్పాటు చేయడంతో సిరంజి వదలిపెట్టి తుపాకి పుచ్చుకున్నారు. ఐఎన్ఎ సాగించిన సాయుధ సమరాలలో భాగస్వామిగా అనేక చారిత్రిక ఘట్టాలకు సాక్షి కూడా అయ్యారు. మొదటి వివాహం విఫలమైన కారణంగా సహయోధుడైన సైగల్‌ను పెళ్లి చేసుకుని సామాజిక చైతన్యంతో కమ్యూనిస్టు ఉద్యమం వైపునకు వచ్చారు. ఐద్వా వ్యవస్థాపక నేతల్లో ఒకరుగానే గాక వైద్యురాలిగానూ ఇప్పటికీ సేవలు చేస్తున్నారు. తన అనుభవాలను ఆమె చాలా సరళంగా నిరాడంబరంగా అక్షరీకరించారు.గతంలో విప్లవ పథంలో నా పయనం అన్న పేరిట అచ్చయిన ఈ పుస్తకాన్ని ఇప్పుడు నేతాజీ సైన్యంలో నేను నా దళం అని మార్చడం అర్థవంతంగా వుంది. ఎందుకంటే ఆమె రాసిన 74 పేజీలలో 68 ఈ దశకు సంబంధించినవే. 1947 తర్వాతి జీవిత గమనాన్ని ఆఖరి అధ్యాయంలో రాశారు. బృందా కరత్ లక్ష్మీ సెహగల్ జీవితంపై రాసిన సమగ్ర వ్యాసాన్ని అనుబంధంగా ఇవ్వడం వల్ల పాఠకుడు ఆమె జీవిత యాత్రను సంపూర్ణంగా వీక్షించగలుగుతాడు. భారత నారీమణుల కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేస్తున్న నారీ మణుల వీరోచిత నేపథ్యం ఏమిటో ఈ పుస్తకం కళ్లకు కడుతుంది. 2002లో ప్రతిపక్షాల తరపున రాష్ట్రపతి స్థానానికి పోటీ చేసిన లక్ష్మీ సెహగల్ సిపిఎం సభ్యురాలే కాకపోతే మన పాలకులు మరెంతగా ఆకాశానికెత్తేవారో! అయితే ఆ మెరమెచ్చుల కన్నా జనం మధ్య ఆఖరు వరకూ పనిచేయడమే తనకు సంతోషమని చెప్పే లక్ష్మీ సెహగల్ ఆత్మకథ చదవడం నిస్సందేహంగా చరిత్రతో సంభాషించడమే.

గతితార్కిక మార్గదర్శి

గతితార్కిక భౌతికవాదం
నండూరి ప్రసాదరావు, పేజీలు-92,
ధర-30/-, ప్రతులకు: ప్రజాశక్తి
బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

గతితార్కిక సూత్రాలను వంటపట్టించుకోకుండా ఎవరూ మార్క్సిస్టు భావజాలాన్ని అర్థం చేసుకోలేరు. ఆ విధంగా ప్రకృతి, సమాజాల పరిశీలనకు ఏకైక మార్గదర్శి అయిన గతితార్కిక భౌతిక వాదంపై నండూరి ప్రసాదరావు రాసిన ఈ పుస్తకం చాలా కాలం తర్వాత పునర్ముద్రణ వెలువడింది. కమ్యూనిస్టుయోధుడుగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన అనుభవాన్ని రంగరించి రాసిన ఈ పుస్తకం పరిమాణంలో చిన్నగానూ పరిజ్ఞానంలో మిన్నగానూ చెప్పుకోవచ్చు. వేర్వేరుగా కనిపించే వివిధాంశాల అంతస్సంబంధాన్ని సులభంగానూ సూటిగానూ వివరిస్తూ గతి తార్కిక సూత్రాల సారం హత్తుకుపోయేలా చేస్తుంది. విజ్ఞానవతి మాధురాలు అంటూ శాస్త్రీయ దృష్టి గలవారికి లేని వారికి మధ్య తేడాను ఎత్తిచూపించడంతో మొదలై చలనశీల ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్న మూలసూత్రాలను ఒక్కొక్కటి విశదీకరిస్తూ ఆసక్తిగా నడుస్తుంది. చరిత్ర,పురాణాలు, విజ్ఞానశాస్త్రం వీటిపై లోతైన అవగాహన వున్న రచయిత సందర్భోచితమైన ఉదాహరణలతో వివరణలతో విసుగెత్తించకుండా చదివిస్తారు. ఈ పుస్తకం చదివిన తర్వాత గతి తర్కం పట్ల అవగాహన పెరగడమే గాక ఆసక్తి కూడా ద్విగుణీకృతమవుతుంది.

-భారతి

టెక్ పేజ్

సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందేకొద్దీ మనిషికి కంప్యూటర్ అవసరం తప్పనిసరి అవుతోంది. అసలు కంప్యూటర్ లేనిదే క్షణం కూడా గడవడంలేదంటే అతిశయోక్తి కాదేమో. అయితే పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు దీన్ని దండిగా సొమ్ము చేసుకుంటున్నాయి. ఎప్పటికప్పుడు కొత్తకొత్త సాఫ్ట్‌వేర్లను విడుదల చేస్తూ దానికి అవసరమైన హార్డ్‌వేర్లను సైతం అప్‌గ్రేడ్ చేస్తున్నాయి. వేలాది రూపాయలతో కొన్న ఒక సాఫ్ట్‌వేర్ ఏడాది తిరిగేసరికి దాని స్థానంలో అప్‌డేట్ వెర్షన్‌ను విడుదల చేస్తున్నారు.

'ఓపెన్ సోర్స్' ఖజానా 'సోర్స్ ఫోర్జ్'

ఉదాహరణకు ఫొటోషాప్‌నే తీసుకుందాం- దీన్ని 1988లో 0.63 వెర్షన్‌తో మొట్టమొదటగా మ్యాకింతోష్ కంప్యూటర్లపై పనిచేసేవిధంగా రూపొందించారు. ఇప్పుడు ఇదే ఫొటోషాప్ సాఫ్ట్‌వేర్ 'ఫొటోషాప్ సిఎస్-5' తాజా వెర్షన్ అధునాతన ఫీచర్లతో అందుబాటులో వుంది. అంటే 1988 నుండి ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫీచర్లను జోడిస్తూ ఇప్పటికి ఇది 17 సార్లు అప్‌గ్రేడ్ చేయబడింది. ఈ సాఫ్ట్‌వేర్‌ను మొదటినుండీ వాడే వినియోగదారు కొత్తఫీచర్ల కోసం దీని తాజా వెర్షన్‌ను తప్పనిసరిగా కొనాల్సి వస్తోంది. లేదా కొత్త సాఫ్ట్‌వేర్ల వినియోగంలో వెనకబడిపోతాం. ఈ క్రమంలోనే ఎక్కువమంది వినియోగదారులు పైరసీ సాఫ్ట్‌వేర్లవైపు చూస్తున్నారు. ఈ పైరసీ సాఫ్ట్‌వేర్లను వాడడం కూడా పెద్ద నేరం. వేలాది రూపాయలతో కొనుగోలు చేసే ఈ సాఫ్ట్‌వేర్లకు ప్రత్యామ్నాయంగా, ఉచితంగా లభ్యమయ్యే ఓపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్లు ఇంటర్నెట్‌లో అందుబాటులో వున్నాయి. ఈ ఓపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్లను వాడుకోవడానికి ఎలాంటి పరిమితులూ, అనుమతులూ అక్కర్లేదు. లైనెక్స్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో పనిచేసే ఈ సాఫ్ట్‌వేర్లు, ఇప్పుడు విండోస్, మ్యాకింతోష్‌లలో కూడా పనిచేసేలా దొరుకుతున్నాయి. ఆఫీస్ సూట్స్, లైనెక్స్ ఆపరేటింగ్ సిస్టమ్స్, హెచ్‌టిఎంఎల్ ఎడిటర్స్, టెక్స్ట్ ఎడిటర్స్, ఫొటో ఎడిటర్స్, యానిమేషన్ టూల్స్, ఇమెయిల్ క్లయింట్స్, బ్రౌజర్స్, ఎఫ్‌టిపి క్లయింట్స్, వెబ్‌సర్వర్స్, కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ చివరికి యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్లతోపాటు ఆడియో, వీడియో సాఫ్ట్‌వేర్లు అనేకం అందుబాటులో వున్నాయి.

ఈ సాఫ్ట్‌వేర్ల కోడ్ కూడా మనకు ఉచితంగా లభిస్తుంది. ఒక సాఫ్ట్‌వేర్‌ను వాడడమేకాక దానికి అదనపు ఫీచర్లను జోడించడం, ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకోవడం, తిరిగి దానిని అందరికీ అందుబాటులోకి తేవడం దీని ప్రత్యేకత. ఔత్సాహిక ప్రోగ్రామర్లు రూపొందించే ఈ సాఫ్ట్‌వేర్లన్నింటినీ ఇంటర్నెట్‌లో అందుబాటులో వుంచేందుకు అనేక వెబ్‌సైట్లు వున్నాయి. వాటిలో 'సోర్స్‌ఫోర్జ్' ఒకటి. చూడటానికి ఇదొక చిన్న వెబ్‌సైట్. కానీ ఇందులో ఊహించనంత ప్రోగ్రామింగ్ డేటా అందుబాటులో వుంది. ప్రపంచవ్యాప్తంగా తయారుచేసిన అనేక సాఫ్ట్‌వేర్లు దీనిలో ఉచితంగా లభిస్తాయి. సిస్టమ్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని రన్ చేసుకోవడానికి ఉపయోగపడే సాఫ్ట్‌వేర్లతోపాటు వాటి తయారీ వెనుక వుండే ఓపెన్‌సోర్స్ కోడ్ ఫైళ్లను కూడా పొందవచ్చు. వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ప్రొప్రైటరీ సాఫ్ట్‌వేర్‌పై మనకు ఎలాంటి అధికారమూ వుండదు. కేవలం దాన్ని వాడుకోవడమే తప్ప దానిపై మనకు ఎలాంటి హక్కు వుండదు. ఇతరులకు ఇచ్చే హక్కుగాని, దాని సోర్స్‌కోడ్ పొందే హక్కుగానీ అంతకంటే వుండదు. కొనుగోలు చేసిన ఒక్క వ్యక్తి మాత్రమే వాటిని ఉపయోగించాలి. అదే ఉచిత సాఫ్ట్‌వేర్లతో ఈ తరహా ఇబ్బందులేవీ వుండవు. ఎటువంటి శ్రమ లేకుండా ఉచితంగా సోర్స్‌కోడ్ పొందవచ్చు. అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసుకోవచ్చు. తిరిగి అందరికీ అందుబాటులో వుంచవచ్చు. ఇటువంటి అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తున్న వేదికే http://sourceforge.net/ వెబ్‌సైట్.

ప్రపంచంలోనే అతి పెద్ద ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వెబ్‌సైట్ 'సోర్స్‌ఫోర్జ్'. అందరికీ అందుబాటులో వుండేవిధంగా పలు రకాల ఓపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్లకు సంబంధించిన కోడ్‌ను దీనిలో వుంచుతారు. వీటి అభివృద్ధికి మనం కూడా ఓ చేయి వేసి డెవలప్ చేయవచ్చు. లేదా అప్పటికే డెవలప్ అయి, అందుబాటులో వున్న వాటిని డౌన్లోడ్ చేసుకుని వినియోగించుకోవచ్చు. డౌన్లోడ్ చేసుకున్న వాటి సోర్స్‌కోడ్‌ను మనం కూడా డెవలప్ చేయవచ్చు. ముఖ్యంగా ప్రోగ్రామింగ్ పట్ల ఆసక్తి వున్న ప్రోగ్రామర్లు, విద్యార్థులు, ఇంజనీర్లు, ప్రోగ్రామింగ్‌ను కెరీర్‌గా తీసుకోవాలనుకునే వారికి, ఈ ఓపెన్ సోర్స్‌కోడ్ ఫైళ్లు అందివచ్చిన అవకాశం. మనం ఉపయోగించే ఏదైనా సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను సరిదిద్ది, మన ఆలోచనలకు అనుగుణంగా మార్పులు చేయాలంటే ఓపెన్‌సోర్స్ కోడ్ ద్వారా చేసే వీలుంది. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో ఈ ఓపెన్‌సోర్స్ ఫైళ్లు ఒక దారి చూపుతాయి. ఈ వెబ్‌సైట్‌లో 2,60,000వరకు వివిధ ప్రాజెక్టులు అందుబాటులో వున్నాయి. 2.7మిలియన్ డెవలపర్లు ఈ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని తమ వర్కులను సబ్మిట్ చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 46 మిలియన్ల వినియోగదార్లున్న ఈ వెబ్‌సైట్ నుండి రోజుకి 20లక్షల డౌన్లోడ్లు జరుగుతున్నాయంటే ఆశ్చర్యపోకతప్పదు మరి.

'సోర్స్‌ఫోర్జ్' వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసిన వెంటనే అనేక రకాల సాఫ్ట్‌వేర్లు కన్పిస్తాయి. హోమ్ పేజీలో ఎడమవైపున వుండే ఇండెక్స్ 'బ్రౌజ్ బై కేటగిరి'లో అన్నిరకాల సాఫ్ట్‌వేర్లు కన్పిస్తాయి. అదేవిధంగా పేజీ మధ్యలోనూ పక్కనున్న పటంలో చూపిన విధంగా 'ఫైల్ షేరింగ్, బ్యాకప్, సెక్యూరిటీ, గేమ్స్, ఆడియో-వీడియో తదితర ఐకాన్స్ కనిపిస్తాయి. వాటిపై క్లిక్ చేస్తే సంబంధిత సాఫ్ట్‌వేర్లు కనిపిస్తాయి. కిందిభాగంలో సబ్మిట్ అయిన ప్రోగ్రామ్స్, డౌన్‌లోడ్స్ వివరాలతోపాటు అనేక ఓపెన్‌సోర్స్ కోడ్ సాఫ్ట్‌వేర్లు లభిస్తాయి.

ఉచితంగా లభ్యమయ్యే ఓపెన్ సోర్స్‌కోడ్ ఫైళ్లను డౌన్లోడ్ చేసుకుని వాటిని ఉపయోగించడమే కాకుండా ఆ సోర్స్‌కోడ్ అభివృద్ధిలో భాగస్వాములు కావచ్చు. ఈ వెబ్‌సైట్‌లో మీరు తయారుచేసిన ఫైళ్లను అప్‌లోడ్ చేసి రిజిస్టర్ చేసుకోవాలంటే యూజర్ ఐడీని క్రియేట్ చేసుకోవాలి. హోమ్‌పేజీలో కుడి భాగాన వుండే క్రియేట్ అకౌంట్ అనే ఐకాన్‌ను ఎంచుకుని ఐడీ క్రియేట్ చేసుకోవాలి. 'సిరిసంపదలు పంచేకొద్దీ తరిగిపోతాయి. విజ్ఞానం పంచేకొద్దీ వృద్ధి చెందుతుంది.' ఔత్సాహిక ప్రోగ్రామర్లు ఈ సైట్‌ను ఉపయోగించుకొని తమ విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు.... పదుగురికీ పంచవచ్చు. సాఫ్ట్‌వేర్ వినియోగదార్లు అవసరమైన సాఫ్ట్‌వేర్లను ఉచితంగా డౌన్లోడ్ చేసుకొని వినియోగించుకోవడం ద్వారా వేలాది రూపాయలను ఆదా చేసుకోవచ్చు.



- కె.ఎక్స్.రాజు

పూర్తిచేయండి

వావ్! బుజ్జాయిలూ... ఆర్టిస్ట్ అంకుల్ మీకు బొమ్మలు నేర్పుతారంట. మరి రెడీనా! అయితే ఇదిగో ఒకటే బొమ్మను 4 సార్లు వేసిచ్చాడు. అయితే ఒక్కో బొమ్మలో ఒక్కో కొరవ పెట్టాడు. దాన్ని మీరు పూర్తిచేయాలి.



గుంపులో కలవనిదేదో...

పిడుగులూ... ఇక్కడ కొన్ని తినే వస్తువులున్నాయి. అన్నీ మీకు తెల్సినవే. కాకపోతే ఇక్కడ వున్నవాటిలో కలవనిది ఒకటి వుంది. అదేదో మీరు చెప్పాలి. దాన్ని ఈ గుంపు నుంచి వేరు చేయాలి. మరి చెప్పుకోండీ.

జవాబు: బంగాళదుంప. దీన్నే ఎందుకు బయటపెట్టాలంటే... మిగతావి పళ్లు కాబట్టి వెంటనే తినేయొచ్చు. దీన్ని మాత్రం కూర వండుకొని తినాలి. అందుకన్నమాట.



గూడు బండి కావాలా!

ఓయ్ బుడుగులూ... మీకు తెలుసో లేదో పల్లెటూళ్లలో రకరకాల బళ్లుంటాయి. అందులో ఎడ్లబండి ఒకటి. దాని మీద ఎక్కి వెళుతుంటే వుంటుందీ! సూపర్. అలాంటిదే గూడుబండి కూడా. దానిని తయారుచేయడమెలాగో చెప్పమంటారా!

ఏమేం కావాలంటే...

గమ్/ఫెవికాల్
కత్తెర
పెన్ను
స్కేలు
కార్డుబోర్డు అట్ట
చార్టు, చీపురు పుల్లలు
తెల్ల కాగితం

ఎలా చేయాలంటే...

ముందుగా చార్టు తీసుకొని ట్రే లాగా తయారుచేసుకోవాలి. ఇందుకు గమ్‌గానీ, టేప్‌గానీ వాడుకోవచ్చు. బండి తొట్టి ఇదేనన్నమాట. ఇప్పుడు బండికి చక్రాలు కావాలికదా. కార్డుబోర్డు అట్టను బండి సైజుకు తగ్గట్టుగా చక్రాల్లా కత్తిరించుకోవాలి. వీటిని చీపురు పుల్లసాయంతో బండి తొట్టికి గుచ్చాలి. ఎలాగంటే ... చక్రాల మధ్యలో రంధ్రం వేసి అందులో చీపురుపుల్లను దూర్చాలి. దీన్ని మళ్లీ తొట్టి కింది భాగంలో రంధ్రం చేసి రెండవ వైపుకు వెళ్లేలా దూర్చాలి. చివరిగా పుల్లకు రెండవ చివర కూడా మరో చక్రం తగిలించాలి. చక్రం ఊడిపోకుండా ఏం చేయాలంటే...కొద్దిగా ఫెవికాల్‌ను చీపురుపుల్ల దగ్గర పూయాలి. ఇలాగే బండి వెనక కూడా రెండు చక్రాలు తగిలించాలి. ఇప్పుడు బండికి టాప్ వుండాలికదా. చార్టును మీ వేలి వెడల్పున వుండేలా కత్తిరించాలి. అదీ బండి తొట్టి లోపల ఈ వైపునుంచి ఆ వైపుకు అతికించాలి. ఇలా 5 సార్లు చేయాలి. ఇప్పుడు దీని మీద తెల్లకాగితం అతికించాలి. అంతే బండి రెడీ. అయితే బండిలో ఎవరైనా వుంటే బావుంటుందికదా. అందుకని కార్డుబోర్డు అట్టమీద ఇద్దరు పిల్లల ఆకారాలు గీసి కత్తిరించుకోవాలి. కళ్లు ముక్కు నోరు గీస్తే పిల్లల బొమ్మలు రెడీ. వీటిని బండి వెనక భాగంలో అతికించండి. అంతే. ఇప్పుడు ఈ బండిని ఎంచక్కా టేబుల్‌మీదో, షోకేస్‌లోనో పెడితే ఎంత బావుంటుందో కదా....మరి చేసేయండి.



గళ్లు నింపేయండే...

నేస్తాలూ... బొమ్మలో కనిపిస్తున్న వస్తువులు, తినుబండారాలను చూశారుగా. వాటిని ఆంగ్లంలో ఏమంటారో తెల్సుగా. మరింకేం. కిందనున్న గళ్లలో నింపేయండి చకచకా.



1. Bat, 2. tomato, 3. Orange, 4.Engine, 5. Egg.



ఏమేం వున్నాయి?

నేస్తాలూ...చూశారుగా. ఒక్క జంతువు ఆకారంలో ఎన్ని జంతువులు, పక్షులు దాక్కున్నాయో! ఇంతకీ ఇక్కడ ఏమేం జంతువులున్నాయి? మొత్తం ఎన్ని? చెప్పుకోండి చూద్దాం. ఒక తెల్లకాగితం తీసుకొని వరుసగా వీటి పేర్లన్నీ రాసేసి చివరికి లెక్కిస్తే సరి. మరి ఆలస్యమెందుకంట.

పోస్ట్‌మ్యాన్‌కు సాయం చేయరూ...

పాపం పోస్ట్‌మ్యాన్ కొత్తగా ఉద్యోగంలో చేరాడు. బోలెడన్ని ఉత్తరాలు తీసుకొని బయలుదేరాడు. ఒక్కో ఇంట్లో ఒక్కో కవర్ ఇవ్వాలి. ఇక్కడున్న అన్ని ఇళ్లకూ వెళ్లాలి. అయితే మరి దారి చూపించి సాయం చేసేయండి.



రంగులు పులిమేద్దాం

ఫ్రెండ్స్! ఈ అబ్బాయిని ఇలా చూస్తుంటే బోసిగా వుందికదూ. మరైతే మీకు నచ్చిన రంగులు అద్ది నిండుగా చేసేయండి.

మాటల కోట - 29

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1	2		3	■	4		5	6
7		■	8	9		■	10	
	■	11	■		■	12	■	
13	14		15	■	16		17	
■		■	18			■		■
19		20		■	21	22		23
	■		■	24	■		■	
25	26	■	27		28	■	29	
30				■	31			

అడ్డం :

1. ఇదీ, బ్రహ్మచారి ముదిరితే పనికిరారని తెలుగు నానుడి (4)
4. బంధుత్వమే ఇంకొక రకంగా (4)
7. ఎత్తుగా ఉన్నవారిని దారి మార్చిన ఈ పక్షితో పోల్చటం కద్దు (2)
8. కొంత భాగం (3)
10. నీటిలో పెరిగే పాచి (2)
13. ఇలా రెండుసార్లు అంటే కోపంగా ఉన్నట్లు (4)
16. సమీక్ష అనంతర పాఠం (4)
18. ఇద్దరో, ఓ గుంపు మధ్యో జరిగే మాటలు (3)
19. కన్నాలు, భూమి లోపల తీసే కలుగులు (4)
21. పండే భూమి అనే (4)
25. చివర (2)
27. చెడ్డవాడు, నీచుడు (3)
29. మూలం, భూమిలో ఉండే మొక్క భాగం ఒక్కటే, ఇంకొకటి అని కూడా (2)
30. నిల్వ ఉన్న వాటిలో పురుగులు చేసే శబ్దాన్ని ఇలా అంటారు. లకలక మాదిరిగా (4)
31. దారి మార్చిన చేయూత (4)

నిలువు

1. దిగులుతో కూడిన ఓ రాష్ట్ర రాజధాని (4)
2. కింద నుంచి పైకి ఎదిగిన దిబ్బకంటే పెద్దదీనూ, పర్వతం కంటె చిన్నదీనూ (2)
3. కింద నుంచి చీలిక, భాగం (2)
4. ప్రజాకవి వేమన అంటాడూ ... కింద నుంచి పైకొచ్చిన ఇది మోగినట్లు కనకం మోగదని (2)
5. ఇద్దరి... వీళ్ల నడుమ మురారి అని నందమూరి బాలయ్య సినిమా ఇక్కడ కింద నుంచి ఒక్కరే మరి (2)
6. నాలుగు నిలువుతో కలుపుకుని అలనాటి తెలుగు సినీ నటుడు జగ్గయ్యకు ఇది ఉందంటారు (4)
9. రెక్కలున్న ఈ జీవి కింద నుంచే గదా పైకి ఎగిరేది (2)
11. అప్పు ఇచ్చేవాడు, వైద్యుడితోపాటు ఎడతెగక పారే ఇది కూడా ఉన్న ఊళ్లోనే ఉండమని సుమతీశతక కర్త బద్దెన చెప్పాడు (2)
12. గంట మోత ఒక్కసారి (2)
14. గుర్రం మీద స్వారీ చేయటం (3)
15. ప్రశ్నించు, ఎదిరించు (3)
16. తవ్వేందుకు వినియోగించే సాధనం (3)
17. ఆ ... అ ... ఒ...అచ్చులతో కూడిన ప (3)
19. ఎముకలే (4)
20. కింద నుంచి నీడ, హిందీలో టీ మాదిరిగా పలుకుతుంది (2)
22. కింద నుంచి వస్తువులను కలగలిపి కట్టటం (2)
23. మున్నూటరవై అయిదు రోజులూ అని, ఆరు కాలాలు వ్యవహారంలో కింద నుంచి (4)
24. జడ, తోక చివర (2)
26. కింద నుంచి అడ్డం 25 (2)
27. ఇలా రెండుసార్లు అంటే అన్నం ఉడికే మోతకు గుర్తు. ఇక్కడ ఒక్కసారే (2)
28. నడుపు అని కింద నుంచి పొట్టిగా చెప్పండి చాలు (2)
29. వస్తువుల అమ్మకంలో ఇదో రకం. కొనుగోలుదారులు పోటీపడి పాడేది (2)

మాటలకోట - 28 జవాబు

1 కం	2 త	■	3 సం	4 క	ల్పం	■	5 త	6 కో
7 పు	ను	గు	■	రు	■	8 చి	టా	రు
■	వు	■	9 పా	వు	10 లు	■	కం	■
11 మూ	■	12 పా	గ	■	13 పా	14 ర	■	15 సు
16 కు	డు	దు	■	17 ఊ	■	18 గు	రు	తు
డు	■	19 గు	20 త్త	■	21 తా	టు	■	డు
■	22 ని	■	23 అ	24 పా	యం	■	25 కా	■
26 వా	టా	లు	■	నీ	■	27 క	సా	28 గు
29 గు	రు	■	30 కా	య	షం	■	31 రం	దా



అగ్గిపుల్ల ఓడలు

అగ్గిపుల్ల...సబ్బుబిళ్ల...కుక్కపిల్ల కాదేదీ కవిత్వానికనర్హం అన్నాడు మహాకవి. అదే విషయం ఎక్కడో ఇంగ్లండ్‌లో వుండే డేవిడ్ రేనాల్డ్స్‌కు తెల్సినట్టుంది. కాకపోతే దాన్ని కొద్దిగా మార్చేసి రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాడు. ఇక్కడ కనిపిస్తున్న ఓడలన్నీ అతను తయారుచేసినవే. అదీ అగ్గిపుల్లలతో. మొదట చెప్పినదానికి ఇప్పుడు చూస్తున్న బొమ్మలకు వున్న సంబంధం ఏవిటో... ఇప్పుడు మీకు అర్థమైందనుకుంటా! అవునండీ... అగ్గిపుల్ల...సబ్బుబిళ్ల... కాదేదీ కళాఖండాల సృష్టికి అనర్హం అంటున్నాడీయన. గత సంవత్సరం కూడా అగ్గిపుల్లలతో అతి పెద్ద ఆయిల్ రిగ్ తయారుచేసి గిన్నిస్‌బుక్ ఎక్కేశాడు. అందుకు 4,075,000 అగ్గిపుల్లలను ఉపయోగించాడు. అప్పుడు లభించిన పేరు, ప్రతిష్టలు అతని కంటిమీద కునుకు లేకుండా చేశాయి. మరిన్ని విజయాలు సాధించాలన్న కసి రేపాయి. ఫలితమే మీ ముందున్న ఓడలు. వీటిని తయారుచేయడానికి పదేళ్లు పట్టింది. ఒక్కో ఓడకు 4 నుంచి 7 మాసాలు కష్టపడేవాడు. 300 నుంచి 400 వరకు బ్రిటిష్ పౌండ్లు ఖర్చుచేసేవాడు. మొత్తంమీద 20 ఓడలు చేసేశాడు. వినడానికి బాగానే వున్నా అందుకు చేయాల్సిన కష్టం అంతా ఇంతా కాదండోయ్! చాలా ఓర్పు కావాలి. 51 ఏళ్ల డేవిడ్ విషయంలో అది కూసింత ఎక్కువేననడానికి సాక్ష్యం ఈ ఓడలే.

పోరాట యోధుడు, నిర్మాణ దక్షుడు కా॥ వి.ఎన్.కు అరుణాంజలి



తెలంగాణ సాయుధ పోరాట యోధులు, భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు నిర్మాణ దక్షుడు, మార్క్సిస్టు సిద్ధాంతంతో రాష్ట్ర కమ్యూనిస్టు నాయకునిగా కఠోరమైన జీవిత త్యాగాలు చేసి చివరంటూ ప్రజా ఉద్యమ బాటలో ప్రస్థానం కొనసాగించి అమరులయ్యారు. మీ ఆశయాలు జీవిత మార్గాన్ని గుర్తు పెట్టుకొని మా శక్తి కొద్ది మీ ఆశయ మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తాం.

మీ ఆరవ వర్ధంతి సందర్భంగా..... అశ్రునివాళులర్పిస్తూ....

నేనూ... నా కుటుంబ సభ్యులు

పాదూరి కరుణ - రాంసుందర్‌రెడ్డి

రవికాంత్ - శ్రీ విద్య | శశికాంత్ - శ్వేత

ప్రవంతి - హరీష్

కా॥ మల్లు వెంకట నర్సింహ్మారెడ్డి గారు

RAVI HI-TECH
Hi-Tech
Engineers & Contractors

శ్రీ శివసాయి మామిడి మొక్కల నర్సరీ

వ్యవసాయ కళాశాల ఎదురుగా, కొత్త పేరాయిగూడెం. అశ్వారావుపేట మం॥, ఖమ్మం జిల్లా.

మా వద్ద అన్ని రకములైన మామిడి, జామ మొక్కలు లభించును.

పి.రాజశేఖర్‌రెడ్డి 9440987380
పి. భాస్కర్‌రెడ్డి 9949283937
షేక్ షాజహాన్ 9491131389

GUARDIAN HOSPITAL

Guardian
Multi Speciality Hospital

ROUND - THE - CLOCK - SERVICES
All Emergencies Including Trauma and Accidents, AMC/SICU
24 Hrs. Anaesthesiology with Critical Care, 24 Hrs. Pharmacy
24 Hrs. Ambulance Service with Supportive Medical Staff

MEDICAL BRANCHES :
* General Medicine * Gastroenterology
* Physiotherapy * Nephrology
* Endocrinology * Oncology
* Pulmonology * Heamatology
* Rheumatology * Dermatolog
* Neurology * Paediatrics

SURGICAL BRANCHES :
* Laparoendoscopic
* General Surgery
* Surgical Oncology
* Trauma & Orthopaedics
* Burns & Plastic Surgery
* Neuro Surgery
* ENT * Ophthalmology
* Surgical Gastroenterology
* Obstertrician & Gynaecology
* Urology.

DIAGNOSTICS :
* Sprial CT Scan
* Ultrasound
* Bio-Chemistry
* Micro-Biology
* Clinical Pathology
* Histopathology
* Cytology
* Digiral X-Ray
* Colour Doppler
* Serology
* Immunology
* Dialysis
* PFT * ENMG
* 2D Echo
* ECG, EEG * ERCP
* Video-Endoscopy
* Colonoscopy
* Sigmoidoscopy
* Bronchoscopy

24 Hours

15-1-237, Opp. L.B. College, Mulugu 'X' Road, Warangal - 506 007. Ph : 0870-2433394, 2429599, 2429499